

జిల్లా ప్రత్యేక అధికారిగా పోలా భాస్కర్

నంద్యాల, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): జిల్లా ప్రత్యేక అధికారిగా పోలా భాస్కర్‌ను నియమిస్తూ ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. జిల్లా యంత్రాంగం, ఆయా శాఖల అధికారులను సమన్వయం చేసుకుంటూ ప్రభుత్వ కార్యక్రమాలు, పథకాలు జిల్లాలో సక్రమంగా అమలు జరిగేలా ఆయన పర్యవేక్షిస్తారు. 2005 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన పోలాభాస్కర్ ప్రస్తుతం సోషల్ వెల్ఫేర్ శాఖకు సెక్రటరీగా కొనసాగుతున్నారు.

చంద్రబాబుపై కరువుసీమ ఆశలు



అసంపూర్తిగా ఆర్డీఎస్ కుడి కాలువ హెడ్ స్లూయిస్

- పందికోన రిజర్వాయర్ కుడి, ఎడమ కాలువలు పూర్తి చేయాలి
- ఆర్డీఎస్, వేదవతి నిర్మిస్తేనే వలసల నివారణ
- గుండ్రేవులపై ప్రత్యేక చొరవ తీసుకోవాలి
- ఓర్వకల్లు పారిశ్రామిక హబ్ అభివృద్ధి వేగం పెరగాలి
- ఎన్నికల తర్వాత తొలిసారిగా జిల్లాకు చంద్రబాబు
- నేడు ఓర్వకల్లులో పింఛన్ల పంపిణీ

కర్నూలు, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): టీడీపీ కూటమికి ఉమ్మడి కర్నూలు జిల్లా ప్రజలు చారిత్రాత్మక విజయం అందించారు. ఇది కౌరవ సభ.. ప్రజా క్షేత్రంలో గెలిచి గౌరవసభలో అడుగు పెడుతానని శపథం చేసిన చంద్రన్నకు ప్రజలు అండగా నిలిచారు. ఇద్దరు ఎంపీలు, 12 మంది ఎమ్మెల్యేలను గెలిపించారు. జూన్ 12న సీఎంగా బాధ్యతలు చేపట్టిన చంద్రబాబు సగర్వంగా గౌరవసభ (అసెంబ్లీ)లో అడుగు పెట్టాడు. 2024 ఎన్నికల తర్వాత తొలిసారిగా కర్నూలు జిల్లాలో ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు అడుగుపెట్టబోతున్నారు. ఓర్వకల్లు మండల కేంద్రంలో శనివారం జరిగే గ్రామసభలో ఆయన పాల్గొంటారు. లబ్ధిదారులకు నేరుగా పింఛన్లను పంపిణీ చేస్తారు. గత వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం వల్ల రాష్ట్ర విభజన తరువాత ఆనాటి టీడీపీ ప్రభుత్వం చేపట్టిన వేదవతి, ఆర్డీఎస్ ప్రాజెక్టులు పడకేశాయి. హంద్రీనీవా ప్రాజెక్టు పత్తికొండ (పందికోన) రిజర్వాయరు కుడి, ఎడమ కాలువలు పూర్తి చేస్తే 35 వేల ఎకరాలకు సాగునీరు ఇవ్వవచ్చు. టమోటా ప్రాసెసింగ్ యూనిట్ పత్తికొండ నియోజకవర్గం రైతుల చిరకాల స్వప్నం. దీనిపై దృష్టి సారించాలి. తమరి కృషి ఫలితంగా ఓర్వకల్లు ఇండస్ట్రియల్ స్మార్ట్ సిటీ అభివృద్ధికి కేంద్రం ఆమోదముద్ర వేసింది. తక్షణం పనులు చేపట్టాలి. అసంపూర్తిగా ఉన్న ఉర్దూ విశ్వవిద్యాలయం, రాయలసీమ యూనివర్సిటీ ఇంజనీరింగ్ కాలేజీ, నంద్యాల, ఆదోని, కర్నూలు మెడికల్ కళాశాలలను పూర్తి చేయాలి. ఇలా ఎన్నో సమస్యలు జిల్లాను వేధిస్తున్నాయి. శనివారం ఓర్వకల్లు మండల కేంద్రంలో పింఛన్ల పంపిణీ కార్యక్రమానికి సీఎం చంద్రబాబు హాజరవుతున్నారు.

- **ఆర్డీఎస్, వేదవతి ప్రాజెక్టులపై దృష్టి సారించాలి**

రాష్ట్ర విభజన తరువాత అప్పటి ముఖ్యమంత్రిగా చంద్రబాబు నిత్యం కరువుతో తల్లడిల్లే మంత్రాలయం, ఎమ్మిగనూరు, కోడుమూరు నియోజకవర్గాల్లో 40 వేల ఎకరాలకు సాగునీరు, 1.20 లక్షల జనాభాకు తాగునీరు అందించే లక్ష్యంగా ఆర్డీఎస్ కుడి కాలువ నిర్మాణానికి రూ.1,985.42 కోట్లు కేటాయించి పనులు చేపట్టారు. ప్రధాన కాలువ కోటేకల్లు, కోసిగి, పెద్దకడుబూరు, చిన్నమరివీడు జలాశయాల నిర్మాణాలు చేయాలి. ఆలూరు, ఆదోని నియోజకవర్గాల్లో 80 వేల ఎకరాలకు సాగునీరు, 1.50 లక్షల జనాభాకు సాగునీటి అందించాలని వేదవతి ఎత్తిపోతల పథకం రూ.1,94.80 కోట్లతో చేపట్టి పనులకు శ్రీకారం చుట్టారు. ఆ తరవాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఐదేళ్ల నిర్లక్ష్యం వల్ల ఎక్కడి పనులు అక్కడే ఆగిపోయాయి.

కర్నూలు ప్రజలు 'గుండె'రేవుల...

కేసీ కెనాల్ ఆయకట్టు 2.65 లక్షల ఎకరాలు. 29.5 టీఎంసీలు నికర జలాల వాటా ఉన్నా.. ఆ నీటిని నిల్వ చేసుకునేందుకు జలాశయం లేదు. సుంకేసుల జలాశయం ఎగువన 20 టీఎంసీల సామర్థ్యంతో గుండ్రేవుల జలాశయం నిర్మాణానికి గత టీడీపీ ప్రభుత్వంలో రూ.2,980 కోట్లు మంజూరు చేశారు. ఆ తరువాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం పట్టించుకోలేదు. ఈ రిజర్వాయర్ నిర్మిస్తే.. కేసీ ఆయకట్టుకు సాగునీరు సహా కోడుమూరు, ఎమ్మిగనూరు, మంత్రాలయం నియోజకవర్గాల్లో గురు రాఘవేంద్ర ఎత్తిపోతల పథకాలు, పులికనుమ, పులకుర్తి లిఫ్టు ద్వారా 1.25 లక్షల ఎకరాల వరకు సాగునీరు ఇవ్వవచ్చు. కర్నూలు నగర ప్రజల తాగునీటి సమస్య శాశ్వతంగా తీరుతుంది. ఓర్వకల్లు పారిశ్రామిక హబ్‌కు కూడా నీటిని సరఫరా చేయవచ్చు.



హంద్రీనీవా కాలువపై అసంపూర్తిగా వేదవతి స్టేజ్-2 పంప్‌హౌస్

పారిశ్రామిక ప్రగతికి శ్రీకారం చుట్టాలి

హైదరాబాదు-బెంగళూరు ఇండస్ట్రియల్ కారిడార్‌లో భాగంగా 'ఓర్వకల్లు ఇండస్ట్రీయల్ నోడ్' అభివృద్ధి చేస్తామని ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ కేంద్ర బడ్జెట్ ప్రసంగంలో స్పష్టంగా వెల్లడించారు. నేషనల్ ఇండస్ట్రియల్ కారిడార్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్‌లో భాగంగా ఓర్వకల్లు ఇండస్ట్రియల్ స్మార్ట్ సిటీగా ఫేజ్-1 కింద 2,621 ఎకరాల్లో రూ.2,786 కోట్లతో అభివృద్ధి చేసేందుకు కేంద్రం ఆమోదం తెలపడం అభినందనీయం. పారిశ్రామిక నగరం అభివృద్ధి చేస్తే నాన్ మెటాలిక్ మినరల్, ఆటోమొబైల్, పునరుత్పాదక, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్ పరికరాలు, ఫార్మాస్యూటికల్స్ వస్త్రాలు, బంగారు ఆభరాలు తయారీ, వస్త్ర ఉత్పత్తి.. వంటి రంగాల్లో రూ.12 వేల కోట్లు పెట్టుబడులు, 45,071 మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని కేంద్రం అంచనా వేసింది. కేంద్రంపై ఒత్తిడి పెంచి నీరు, రోడ్లు, రవాణా, విద్యుత్ వంటి మౌలిక వసతుల కల్పనకు ప్రత్యేక చొరవ తీసుకోవాలి.



ఓర్వకల్లులోని స్టీల్‌ప్లాంట్

వీటిపైనా దృష్టిసారించాలి

- కర్నూలు, ఆదోని, నంద్యాల మెడికల్ కళాశాలల పనులు నత్తతో పోటీ పడుతున్నాయి. ప్రధానంగా నిధుల సమస్య వెంటాడుతోంది. నిధులు ఇవ్వాలి.. ప్రత్యేక దృష్టిని సారించి ఈ కళాశాల నిర్మాణాలు పూర్తి చేయాలి.
- రాయలసీమ యూనివర్సిటీ ఇంజనీరింగ్ కళాశాల 192 ఎకరాల్లో జగన్నాథగట్టుపై నిర్మాణం చేపట్టారు. రూసా నిధులు రూ.20 కోట్లు ఇచ్చారు. పునాదులతో పనులు ఆగపోయాయి.
- డాక్టర్ అబ్దుల్ హక్ ఉర్దూ విశ్వవిద్యాలయం ఓర్వకల్లు విమానాశ్రయం పక్కనే 144.92 ఎకరాల్లో గత టీడీపీ ప్రభుత్వంలో నిర్మాణం చేపట్టారు. ఫేజ్-1 కింద రూ.18 కోట్లు నిధులతో అకడమిక్ బ్లాక్ గ్రౌండ్ ఫ్లోర్ 75 శాతం, ఫస్ట్‌ఫ్లోర్ 25 శాతం, బాలిక హాస్టళ్ల బేస్‌మట్టం, పిల్లర్ల వరకు నిర్మించారు. వైసీపీ ప్రభుత్వం వచ్చాక ఒక్క ఇటుక కూడా వేయలేదు.
- కర్నూలు, నంద్యాల, ఎమ్మిగనూరు, ఆదోనిలో నిర్మాణాలు పూర్తైన 21 వేల టిడ్కో ఇళ్లను పేదలకు పంపిణీ చేయాలి.

చలమస్టేషన్‌లో ఆగిన గూడ్స్

పలు రైళ్ళ రాక పోకలకు అంతరాయం

మహానంది, ఆగస్టు 30: గుంటూరు- గుంతకల్లు రైల్వే మార్గంలోని గాజులపల్లి ఆర్ఎస్- చలమ రైల్వే స్టేషన్ సమీపంలోని అటవీఘాట్‌లో ఓవర్ లోడ్‌తో ఓ గూడ్స్ రైలు అర్ధాంతరంగా నిలిచిపోయింది. అధిక లోడ్‌తో వెళ్తున్న ఆ గూడ్స్ శుక్రవారం రాత్రి 8 గంటలకు ఆగిపోయింది. దీంతో విజయవాడ నుంచి హుబ్లీ మధ్య నడుస్తున్న ప్యాసింజర్ రైలును నల్లమల ప్రాంతం చలమ రైల్వే స్టేషన్‌లోనే అధికారులు నిలిపివేశారు. నంద్యాల నుంచి ప్రత్యేకంగా ఇంజన్‌ను తెప్పించి ఆగిన గూడ్స్ రైలును విజయవాడ వైపు పంపేందుకు రైల్వే అధికారులు చర్యలు చేపట్టారు. అంతవరకు ఈ రైల్వే లైన్‌లో తిరిగే పలు రైళ్లను ప్రకాశం జిల్లా గిద్దలూరులో, మరికొన్ని నంద్యాల రైల్వే స్టేషన్‌లో నిలిపివేశారు. తమ ప్రయాణంలో జరిగిన అంతరాయం గురించి ప్రయాణికులు కుటుంబ సభ్యులకు తెలిపేందుకు ఇబ్బందులు పడ్డారు. దట్టమైన అటవీ ప్రాంతం కావడంతో ఇక్కడ సెల్‌ఫోన్ సిగ్నల్స్ లేవు. చివరకు రెండు గంటల తర్వాత రైల్వే మార్గం క్లియర్ కావడంతో రైళ్లు యథావిధిగా కొనసాగాయి.



చలమ రైల్వే స్టేషన్‌లో ఆగిన విజయవాడ- హుబ్లీ ప్యాసింజర్ రైలు

పర్యావరణ పరిరక్షణతోనే మనుగడ: మంత్రి ఫరూక్



మొక్కకు నీరు పోస్తున్న మంత్రి ఫరూక్

నంద్యాల, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణతోనే మానవుని మనుగడ సాధ్యమని మంత్రి ఎన్ఎండీ ఫరూక్ అన్నారు. 75వ వన మహోత్సవంలో భాగంగా శుక్రవారం నంద్యాలలోని ప్రభుత్వ వైద్య కళాశాల ఆవరణలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. మంత్రి ఫరూక్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వన మహోత్సవ కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా చేపట్టిందని, ప్రతి ఒక్కరూ పర్యావరణ పరిరక్షణలో మొక్కలు నాటి సంరక్షించాలని సూచించారు. కలెక్టర్ రాజకుమారి మాట్లాడుతూ మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఉద్యమంలా చేపట్టాలని పిలుపునిచ్చారు. జిల్లాలో 9.64 లక్షల హెక్టార్ల భూమి ఉందని, అందులో 3.14 లక్షల హెక్టార్లలో 32.8 శాతం పర్యావరణ సంబంధమైన అటవీ భూముల విస్తీర్ణం ఉందని చెప్పారు. నీటిమట్టం దిగువకు పోవడం వల్ల నీటి కొరత ఏర్పడిందని, 11 గ్రామాలకు ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నామని తెలిపారు. మెడికల్ కళాశాల ఆవరణలో 1500 మొక్కలను నాటేందుకు లక్ష్యంగా పెట్టుకున్నామని, వాటిని వైద్య కళాశాల యాజమాన్యం సంరక్షించే బాధ్యత తీసుకోవాలని ఆమె సూచించారు. జేసీ విష్ణుచరణ్, అటవీశాఖ చీఫ్ కన్జర్వేటర్లు రామకృష్ణ, మూర్తి, డీడీ అనురాగ్ మీనా, డీఎఫ్‌వో శివశంకర్‌రెడ్డి, మెడికల్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఆనంద్‌కుమార్, ఆర్డీవో మల్లికార్జున రెడ్డి, అటవీశాఖ, వైద్య కళాశాల సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

వైద్య కళాశాల తనిఖీ: నంద్యాలలోని ప్రభుత్వ వైద్య కళాశాలను మంత్రి ఫరూక్, కలెక్టర్ రాజకుమారి తనిఖీ చేసి వసతులను పరిశీలించారు. వారు మాట్లాడుతూ మెడికల్ కళాశాలలో సమస్యలను పరిష్కారానికి, సౌకర్యాల కల్పనకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఆర్వో ప్లాంట్, ఫర్నిచర్, ల్యాబ్ పరికరాలు, లెక్చరర్ గ్యాలరీ, హాస్టల్‌లోని కనీస కల్పనపై నివేదికలు ఇవ్వాలని కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఆనంద్ కుమార్‌కు సూచించారు. కళాశాలకు రెండు నూతన బస్సులు మంజూరయ్యాయని, డ్రైవర్లు లేని కారణంగా అవి నిరుపయోగంగా ఉన్నాయని వైస్ ప్రిన్సిపాల్ మంత్రి, కలెక్టర్ దృష్టికి తీసుకు వచ్చారు.

ముందుగానే పింఛన్లు

- జిల్లా వ్యాప్తంగా 2,19,046 మంది లబ్ధిదారులు
- రూ.92.56 కోట్ల పంపిణీ
- పాల్గొననున్న మంత్రులు, ఎమ్మెల్యేలు



నంద్యాల, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): పింఛన్ల పంపిణీలో వలంటీర్లను ఉపయోగించుకోకూడదని చెప్పినందుకు పండుటాకులను మండే ఎండల్లో రోడ్ల మీదకు తీసుకువచ్చింది గతంలో వైసీపీ ప్రభుత్వం. ఒకటో తేదీ ఆదివారం అవుతుండటంతో ఒక్క రోజు ముందుగానే పింఛన్లను అందజేస్తోంది కూటమి ప్రభుత్వం. జిల్లాలో మొత్తం 2,19,046 పింఛనుదారులు ఉన్నారు. వారికి రూ.4 వేలు, రూ.5 రూ.6 వేలు, రూ.10 వేలు, రూ.15 వేల చొప్పున ఆయా పింఛనుదారులకు అందించనున్నారు. వీరందరికీ అధికార యంత్రాంగం రూ.92.56 కోట్ల పంపిణీ చేయనుంది. శనివారం ఒక్కరోజులోనే వందశాతం పింఛన్ల పంపిణీ పూర్తి చేయడానికి యంత్రాంగం సిద్ధమైంది. ఇందులో భాగంగా సంబంధిత సిబ్బంది సేవలను వినియోగించుకోనున్నారు. పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో అధికార యంత్రాంగంతో పాటు కూటమి నేతలు పాలు పంచుకోనున్నారు

ఏర్పాట్లు పూర్తి : కలెక్టర్ రాజకుమారి

ఎన్టీఆర్ భరోసా సామాజిక పెన్షన్లను శనివారం రోజున ఇంటింటికి తిరిగి పంపిణీ చేసేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు కలెక్టర్ రాజకుమారి వెల్లడించారు. ఈ మేరకు శుక్రవారం అధికారులతో ఆమె వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాజకుమారి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు సెప్టెంబరు ఒకటో తేదీ ఆదివారం సెలవు కావడంతో ఆగస్టు31న పింఛన్లను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ఉదయం 6 గంటలకు అన్ని సచివాలయాల పరిధిలోని లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పింఛన్లు పంపిణీ చేసేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేసుకోవాలన్నారు. పింఛన్ల పంపిణీలో 8,800 మంది సచివాలయ సిబ్బందితో పాటు ఇతర శాఖల అధికారులు పాల్గొంటారని తెలిపారు. అనివార్యకారణాలతో పింఛన్లను అందుకోలేని వారికి సెప్టెంబరు 2న అందిస్తాలని కలెక్టర్ ఆదేశించారు.

ఉపాధి పనుల్లో అక్రమాల వెల్లువ

రూ.5,86,197 రికవరీకి ఆదేశం

అవుకు, ఆగస్టు 30: అవుకు మండలంలో జరిగిన మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం పనుల్లో పెద్ద ఎత్తున అక్రమాలు వెలుగు చూశాయి. శుక్రవారం అవుకు మండల పరిషత్ కార్యాలయం వద్ద ఏడాదిలో జరిగిన ఉపాధి పనులపై నిర్వహించిన సామాజిక బహిరంగకు పీడీ రామచంద్రరెడ్డి, ఏపీడీ బాలాజీనాయక్ హాజరయ్యారు. మండలంలో 2023-4-1 నుంచి 2024-3-31 వరకు 21 పంచాయతీల్లో ఎన్ఆర్‌జీఎస్, పంచాయతీరాజ్, హౌసింగ్, సమగ్రశిక్ష, పశుసంవర్ధక, గ్రామీణ నీటి సరఫరా శాఖల్లో పనుల కోసం రూ.6.34 కోట్లు ఖర్చు చేశారు. వీటిపై ఈనెల 16వతేదీ నుంచి 28వతేదీ వరకు ఎస్ఆర్‌పీ ఆధ్వర్యంలో 11 మంది డీఆర్‌పీలు, వీఎస్‌ఏలు కలసి గ్రామాల్లో క్షేత్రస్థాయిలో పర్యటించి జరిగిన ఉపాధి పనులపై తనిఖీలు చేశారు. ఇందులో అత్యధికంగా మన్నేనాయక్‌తండాలో రూ.1,63,599, కునుకుంట్లలో రూ.1,59,225, కాశీపురంలో రూ.84,563, చెన్నంపల్లెలో రూ.54,276, అవుకులో రూ. 19,427, కొండమనాయునిపల్లెలో రూ.18,685, చెర్లోపల్లెలో రూ.15,232, మంగంపేటలో రూ.13,063, శివవరం పంచాయతీల్లో రూ.10,651 చొప్పున అక్రమాలు వెలుగు చూశాయి. మొత్తం రూ.5,86,197 రికవరీకి పీడీ ఆదేశించారు. ఫీల్డ్ అసిస్టెంట్లకు రూ. 8వేలు జరిమానా విధించారు. గ్రామ వలంటీర్లకు వారానికి మూడు రోజులు మాత్రమే పని కల్పించాల్సి ఉన్నా ఆరు రోజులు పని కల్పించినట్లు అధికారులు గుర్తించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో వెంకటేశ్వరరెడ్డి, పంచాయతీరాజ్ ఏఈ వెంకటరమణ, హౌసింగ్ ఏఈ కృష్ణారెడ్డి, వెలుగు ఏపీఎం విజయగోపాల్, వైస్ ఎంపీపీ రామప్ప, సర్పంచ్ గుర్రమ్మ పాల్గొన్నారు.



వివరాలను వెల్లడిస్తున్న అధికారులు

బెళగావికి వారాంతపు రైలు

నంద్యాల, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): నంద్యాల మీదుగా భువనేశ్వర్ నుంచి బెళగావి ప్రాంతానికి వారాంతపు స్పెషల్ ఎక్స్‌ప్రెస్ రైలు రైల్వే అధికారులు ఏర్పాటు చేసినట్లు నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి శుక్రవారం తెలిపారు. 02813 భువనేశ్వర్- బెళగావి స్పెషల్ ఎక్స్‌ప్రెస్ రైలు సెప్టెంబరు 7న భువనేశ్వర్‌లో బయలు దేరి 8వ తేదీ నంద్యాలకు చేరుకుంటుందని చెప్పారు. నంద్యాల నుంచి గుంతకల్ మీదుగా బెళగావి ప్రాంతానికి చేరుకుంటుందని చెప్పారు. 02814 నంబర్ గల స్పెషల్ ఎక్స్‌ప్రెస్ రైలు బెళగావి నుంచి నంద్యాల, విజయవాడ, విశాఖపట్నం మీదుగా భువనేశ్వర్‌కు చేరుకుంటుందని తెలిపారు. సెప్టెంబరు 7 నుంచి నవంబరు 30వ తేదీ వరకు ఈ స్పెషల్ ఎక్స్‌ప్రెస్ రైలు రాకపోకలు సాగిస్తుందని తెలిపారు.

వేంపెంటలో డయేరియా కలకలం

- మహిళ మృతి.. మరో ఆరు కేసులు నమోదు
- కొనసాగుతున్న చికిత్సలు
- గ్రామానికి తరలిన అధికారులు

పాములపాడు, ఆగస్టు 30: పాములపాడు మండలం వేంపెంట గ్రామంలో డయేరియాతో మహిళ మృతి చెందడం కలకలంగా మారింది. దీంతో అధికారులు ఒక్కసారిగా అప్రమత్తమై గ్రామానికి పరుగులు తీశారు. వేంపెంటకు చెందిన బోయ లక్ష్మిదేవి (70) శుక్రవారం ఉదయం వాంతులు, విరేచనాలు అధికం కావడంతో చికిత్స నిమిత్తం ఆత్మకూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలిస్తుండగా మృతి చెందింది. గురువారం 13 మంది డయేరియా బారిన పడగా... శుక్రవారం మరో ఆరు కేసులు నమోదైనట్లు వైద్యాధికారులు వెల్లడించారు. గ్రామంలో డయేరియా ప్రబలడంతో జిల్లా వైద్యాధికారి వెంకటరమణ, ప్రోగ్రాం ఆఫీసర్ కాంతారావు నాయక్, ఆర్డీఓ దాస్, ఎంపీడీఓ గోపికృష్ణ, తహసీల్దార్ సుభద్రమ్మ, మండల వైద్యాధికారి నాగలక్ష్మి, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు వేంపెంటకు వెళ్లారు. గ్రామంలో తాగునీరు కలుషితమైందని అధికారులు గుర్తించారు. వెంటనే తాగునీటి బోరు, పరిసర ప్రాంతాలు, మసీదు ఏరియాలను పరిశీలించి, బ్లీచింగ్ చల్లారు. ప్రజలు వాంతులు విరేచనాల బారిన పడటానికి గల కారణాలు, అరికట్టడానికి తదితర సమస్యలపై చర్చించారు. గ్రామంలో పారిశుధ్య పనులు, మురుగునీటి నిల్వ ఉండకుండా ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రతి ఇంటికి మంచినీటిని పంపిణీ చేశారు. గ్రామంలో కేసుల పెరగకుండా ఉండేందుకు అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నట్లు వైద్యాధికారులు వెల్లడించారు. రెండు రోజులుగా డయేరియా బారిన పడిన వారికి కర్నూలు, నంద్యాల, ఆత్మకూరు, స్థానిక సచివాలయం, ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతున్నారని మరో రెండు రోజుల్లో పరిస్థితి పూర్తిగా అదుపులోకి వస్తుందన్నారు గ్రామంలో వైద్యుల పర్యవేక్షణలో వైద్యశిబిరాలు ఉంటాయన్నారు. ఐదు చోట్ల నీటి నమూనాలను సేకరించి ల్యాబ్‌కు పంపించినట్లు తెలిపారు.



లక్ష్మిదేవి (ఫైల్)



బాధితులకు చికిత్స అందిస్తున్న దృశ్యం



పర్యవేక్షిస్తున్న జిల్లా వైద్యాధికారి వెంకటరమణ

ఓర్వకల్లు ఎయిర్‌పోర్టులో భద్రతా ఏర్పాట్ల పరిశీలన



ఏర్పాట్లను పరిశీలిస్తున్న జిల్లా ఎస్పీ బిందు మాధవ్

ఓర్వకల్లు, ఆగస్టు 30: జిల్లాలో శనివారం ఓర్వకల్లు మండల కేంద్రంలో జరిగే పింఛన్ల పంపిణీ కార్యక్రమానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రానున్న సందర్భంగా శుక్రవారం జిల్లా ఎస్పీ బిందు మాధవ్ ఓర్వకల్లు ఎయిర్ పోర్టు వద్ద భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు. పోలీసు బందోబస్తు తదితర ఏర్పాట్లపై సంబంధిత అధికారులకు పలు సూచనలు, సలహాలు చేశారు. ఎస్పీ వెంట ఇంటెలిజెన్స్ అధికారులు, డీఎస్పీలు బాబు ప్రసాద్, కృష్ణమోహన్, శ్రీనివాసరావు, సీఐలు చంద్రబాబు నాయుడు, ప్రసాద్, ఎస్‌ఐలు మల్లికార్జున, సునీల్ కుమార్ తదితరులు ఉన్నారు.

ద్విచక్ర వాహనాల దొంగ అరెస్ట్

ఆరు బైక్‌లు స్వాధీనం



నిందితుడిని అరెస్టు చూపుతున్న పోలీసులు

ఓర్వకల్లు, ఆగస్టు 30 : ఉమ్మడి కర్నూలు జిల్లాలోని పలు ప్రాంతాల్లో ద్విచక్ర వాహనాల చోరీకి పాల్పడుతున్న దొంగను ఓర్వకల్లు పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో కర్నూలు డీఎస్పీ బాబుప్రసాద్, గ్రామీణ సీఐ చంద్రబాబునాయుడు, ఎస్‌ఐ సునీల్ కుమార్ ముద్దాయి వివ రాలను వెల్లడించారు. నంద్యాల నగరం బాలాజీ కాంప్లెక్స్‌కు చెందిన షేక్ మహ మ్మద్ వలి అనే వ్యక్తి బైకు దొంగతనాలే వృత్తిగా ఎంచుకున్నాడు. మండల పరిధి లోని సోమయాజులపల్లె సమీపంలోని బేతంచెర్ల క్రాస్‌రోడ్డు వద్ద అనుమా నాస్పదంగా తిరుగుతున్న మహమ్మద్ వలిని పోలీసులు అదుపులోకి తీసుకు న్నారన్నారు. ముద్దాయిని విచారణ చేసి రూ.2.80 లక్షల విలువ గల ఆరు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. మండలంలో నాటుసారా, మట్కా, పేకాట వంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని డీఎస్పీ హెచ్చరించారు.

పెద్దహోతూరులో చోరీ

ఆలూరు, ఆగస్టు 30 : ఆలూరు మండలం పెద్ద హోతూరు గ్రామంలో గురువారం రాత్రి మాల తిక్కయ ఇంట్లో చోరీ జరిగింది. ఇంట్లో ఉన్న బీరువాను పగలగొట్టి 4 తులాల బంగారం, 80 తులాల వెండి, రూ.60వేల నగదు అపహరించుకుపోయారు. మాల తిక్కయ్య కడపలో పని చేసేందుకు వెళ్లగా దొంగలు పడ్డారు. శుక్రవారం ఆలూరు పోలీసులకు బాధిత కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేశారు. దీంతో రంగంలోకి దిగిన క్లూస్ టీమ్ చోరీ జరిగిన ఇంట్లో వేలిముద్రలు సేకరించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వెంకటనరసింహులు తెలిపారు.

2,621 ఎకరాలు.. రూ.2,786 కోట్లు..!

- ఓర్వకల్లు ఇండస్ట్రియల్ హబ్‌కు మంచి రోజులు
- 45 వేల మందికి ఉద్యోగ, ఉపాధికి అవకాశాలు
- పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత

కల్లూరు, ఆగస్టు 30: ఓర్వకల్లు మండలంలో 2,621 ఎకరాల్లో ఇండస్ట్రియల్ హబ్‌లో భాగంగా మొదటి దశగా రూ.2,786 కోట్ల నిధులను ఎన్డీయే ప్రభుత్వం బడ్జెట్‌లో కేటాయింపు చేసిందని పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత పేర్కొన్నారు. ఇండస్ట్రియల్ హబ్‌గా ఓర్వకల్లు మండలం రూపురేఖలు మారబోతున్నాయని ఆమె హర్షం వ్యక్తం చేశారు. శుక్రవారం తన స్వగృహంలో ఆమె టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులతో కలసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గౌరుచరిత మాట్లాడుతూ కర్నూలు జిల్లా కేంద్రానికి 20 కిలో మీటర్ల దూరంలో వ్యవసాయానికి ఆమోదయోగ్యం కాని 33 వేల ఎకరాల ప్రభుత్వ భూమిని గుర్తించి సీఎం చంద్రబాబునాయుడు ఓర్వకల్లును ఇండస్ట్రియల్ హబ్‌కు శ్రీకారం చుట్టారన్నారు. టీడీపీ ప్రభుత్వంలో సోలార్ పరిశ్రమ, జయరాజ్ ఇస్పాత్ ఉక్కు పరిశ్రమ, ఎయిర్‌పోర్టు, డీఆర్‌డీఓ లాంటి పరిశ్రమలు తీసుకువచ్చారని అన్నారు. గత వైసీపీ హయాంలో ఓర్వకల్లు ఇండస్ట్రియల్ కారిడార్ తీవ్ర నిర్లక్ష్యనికి గురైందని, టీడీపీ ప్రభుత్వంలో ఏర్పాటు చేసిన శిలాఫలకాలు ధ్వంసం చేయడం, స్థలాలు కబ్జా చేయడం జరిగిందన్నారు. సీఎం చంద్రబాబునాయుడు ప్రారంభించిన ఎయిర్ పోర్టుకు మళ్లీ పునఃప్రారంభించడం తప్ప అభివృద్ధి శూన్యమన్నారు. రాష్ట్రంలో పారిశ్రామిక అభివృద్ధికి కేంద్రంలోని ఎన్‌డీఏ ప్రభుత్వం సహకారం మరువలేనదన్నారు. జూలై 23న ఓర్వకల్లును ఇండస్ట్రియల్ స్మార్ట్ సిటీగా ప్రకటించారని అంతేకాకుండా 2,621 ఎకరాల్లో రూ.2,786 నిధులు బడ్జెట్‌లో విడుదల చేశారని ఆనందం వ్యక్తం చేశారు. ఓర్వకల్లు ఇండస్ట్రీయల్ హబ్ ఏర్పాటుతో 45 వేల మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన జిల్లా అధ్యక్షుడు చింతా సురేష్, బీజేపీ నాయకులు గంగాధర్, తెలుగు మహిళ జిల్లా అధ్యక్షు రాలు కె.పార్వతమ్మ, కర్నూలు మార్కెట్‌యార్డ్ మాజీ చైర్మన్ పెరుగు పురుషోత్తంరెడ్డి, కల్లూరు మండల టీడీపీ అధ్యక్షుడు డి.రామాంజ నేయులు, పాణ్యం వాణిజ్య విభాగం అధ్యక్షుడు బ్రాహ్మణపల్లె నాగిరెడ్డి, తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్‌యాదవ్, తడకనపల్లె సర్పంచు సహరాబి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న పాణ్యం ఎమ్మెల్యే గౌరుచరిత

కర్ణాటక మద్యం స్వాధీనం

మూడు బైకులు సీజ్



మద్యం బాక్సులను చూపిస్తున్న పోలీసులు

కోసిగి, ఆగస్టు 30: మండలంలోని కందుకూరు గ్రామ సమీపంలోని తుంగభద్ర నదితీరాన ఉన్న రామలింగేశ్వరస్వామి ద్వారం దగ్గర 30 బాక్సుల అక్రమ కర్ణాటక మద్యాన్ని సెబ్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. సెబ్ సీఐ ఎస్.మహబూబ్‌బాషా, ఎస్ఐ రమేష్‌బాబు మాట్లాడుతూ శుక్రవారం తెల్లవారుజామున కౌతాళం మండలం తిప్పలదొడ్డి గ్రామానికి చెందిన వీకే నరసింహులు, కాకంగారి జగదీష్, తలారి గంగన్న మూడు బైకులపై ఒక్కొక్కరు పది బాక్సుల ప్రకారం మొత్తం 30 బాక్సుల్లో 2,880 టెట్రా మద్యం ప్యాకెట్లను తీసుకెళ్తుండగా స్వాధీనం చేసుకుని మూడు బైకులను సీజ్ చేసి నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు సెబ్ పోలీసులు తెలిపారు. ఈ దాడుల్లో సెబ్ హెడ్ కానిస్టేబుల్ నాగరాజు, కానిస్టేబుళ్లు మధుసూదన్, నాగరాజు ఉన్నారు.

వ్యక్తి అరెస్టు, బైక్ సీజ్

మంత్రాలయం, ఆగస్టు 30: మండలంలోని మాధవరం గ్రామ సమీపంలో చెక్‌పోస్టు వద్ద కర్ణాటక మద్యం బైక్‌పై తెస్తుండగా.. మాధవరం ఎస్‌ఐ విజయ్ కుమార్, హెడ్ కానిస్టేబుల్ గురుమూర్తిలు దాడులు చేసి పట్టుకున్నారు. శుక్రవారం ఎమ్మిగనూరు చెందిన గద్వాల సైఫుల్లా అనే వ్యక్తి తన మోటారు సైకిల్‌పై 90 ఎంఎల్ 260 ఒరిజినల్ చాయిస్ టెట్రా ప్యాకెట్లు తరలిస్తుండగా.. పట్టుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

సాయి ఈశ్వరుడి హత్య కేసు...

- హైకోర్టులో విట్నెస్ రీకాల్ పిటిషన్
- చికెన్ బాషా, 'బైరెడ్డి' సంభాషణలను పరిగణనలోకి తీసుకోవాలని విజ్ఞప్తి
- సెప్టెంబరు 5కు విచారణ వాయిదా

అమరావతి, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): నందికొట్కూరు మార్కెట్‌యార్డు వైస్ చైర్మన్ సాయి ఈశ్వరుడు 2014లో దారుణంగా హత్యకు గురయ్యారు. ఆ కేసులో ప్రధాన నిందితుడు చికెన్ బాషా, ఏ 5గా ఉన్న వైసీపీ నేత బైరెడ్డి సిద్ధార్థరెడ్డి మధ్య జరిగిన ఫోన్ సంభాషణ రికార్డును సాక్ష్యంగా పరిగణించాలని కోరుతూ దాఖలు చేసిన విట్నెస్ రీకాల్ పిటిషన్‌ను విజయవాడ ఎంపీ, ఎమ్మెల్యేల ప్రత్యేక కోర్టు తిరస్కరించింది. దానిని సవాల్ చేస్తూ మృతుడి కుమార్తె జ్యోతి హైకోర్టులో క్రిమినల్ రివిజన్ పిటిషన్ దాఖలు చేశారు. ఆ పిటిషన్‌పై శుక్రవారం హైకోర్టులో సుదీర్ఘ వాదనలు జరిగాయి. పిటిషనర్ తరపు న్యాయవాది గూడపాటి వెంకటేశ్వరరావు వాదనలు వినిపిస్తూ.. 'హత్య కేసులో నిందితులుగా ఉన్న బైరెడ్డి సిద్ధార్థరెడ్డి, చికెన్ బాషాల మధ్య జరిగిన ఫోన్ సంభాషణను పరిగనణలోకి తీసుకోవాలని కోరుతూ సీఆర్‌పీసీ సెక్షన్ 311 ప్రకారం విట్నెస్ రీకాల్ పిటిషన్ దాఖలు చేశాం. హత్యకేసుపై విచారణ జరుపుతున్న విజయవాడలోని ప్రత్యేక కోర్టు ఆ పిటిషన్‌ను తోసిపుచ్చింది. మృతుడి కుమార్తెగా రీకాల్ పిటిషన్ దాఖలు చేసే అధికారం పిటిషనర్‌కు ఉంటుంది. కేసులో విచారణ పూర్తి అయ్యి, తీర్పు వెల్లడించేలోపు సాక్ష్యాలను కోర్టు ముందు ఉంచేందుకు చట్టంలో వెసులుబాటు ఉంది. అందుకు సంబంధించి సుప్రీంకోర్టు ఇచ్చిన పలు తీర్పులను కోర్టు ముందు ఉంచుతున్నా. నిందితుల మధ్య జరిగిన ఫోన్‌కాల్ సంభాషణను సాక్ష్యంగా నమోదు చేసేందుకు సాక్ష్యాల నమోదు ప్రక్రియను తిరిగి తెరిచేలా విజయవాడ కోర్టును ఆదేశించండి' అని కోరారు. నిందితుడు బైరెడ్డి సిద్ధార్థరెడ్డి తరపు న్యాయవాది యు.ఉమామహేశ్వరరావు వాదనలు వినిపిస్తూ.... 'విజయవాడ కోర్టు ఉత్తర్వులను సవాల్ చేస్తూ రివ్యూ పిటిషన్ దాఖలు చేసే అధికారం పిటిషనర్‌కు లేదు. సాక్ష్యాలను ప్రాసిక్యూషన్ ద్వారా మాత్రమే కోర్టు ముందు ఉంచాలి. నిందితుల మధ్య జరిగిన సంభాషణగా చెబుతున్న ఫోన్ కాల్ ఆడియోను కోర్టు ముందు ఉంచే విషయంలో చట్టం నిర్దేశించిన విధానాన్ని పిటిషనర్ అనుసరించలేదు. కేసు విచారణ తుదిదశకు చేరిన ఈ దశలో సాక్ష్యాలను కోర్టు ముందు ఉంచేందుకు నిబంధనలు అనుమతించవు' అని పేర్కొన్నారు. శుక్రవారం కోర్టు సమయం ముగియడంతో వాదనలు కొనసాగింపు కోసం విచారణను సెప్టెంబరు 5కి వాయిదా వేస్తున్నట్లు ప్రకటించిన హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వీఆర్‌కె కృపాసాగర్ శుక్రవారం ఆమేరకు ఉత్తర్వులు ఇచ్చారు.

విచ్చలవిడిగా బయో మందులు!

పోలీసుల దాడుల్లో వెలుగు చూసిన అక్రమ వ్యాపారం



బయో మందుల కేంద్రాన్ని సీజ్ చేసిన పోలీసులు

ప్యాపిలి, ఆగస్టు 30: మండలంలోని వెంగళాంపల్లి గ్రామం సమీపంలోని ఓ తోటలో బయో మందుల తయారీ కేంద్రాన్ని నెలకొల్పారు. అనంతపురం జిల్లా రాయలచెరువుకు చెందిన ఓ వ్యాపారి వైసీపీ నేత అండదండలతో ఈ తయారీ కేంద్రాన్ని నిర్వహిస్తున్నారు. నిషేధిత మందులను తయారు చేసి దోపిడి చేస్తున్నట్లు సమాచారం. శుక్రవారం సీఐ వెంకటరామిరెడ్డి ఆధ్వర్యంలో బయోమందుల తయారీ కేంద్రంపై దాడులు చేయడంతో అసలు విషయాలు వెలుగులోకి వచ్చాయి. ఆక్వా ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ అని చెబుతున్నా అక్కడ వివిధ రకాల కెమికల్స్ ఉండడంతో నిషేధిత బయో మందుల తయారీ జరుగుతున్నట్లు పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. తయారీ కేంద్రంలో నిల్వ ఉంచిన బయో కిమికల్ మందులను, రసాయనాలను పోలీసులు స్వాధీనం చేసుకు స్టేషన్‌కు తరలించారు. ఈ మందులను వ్యవసాయశాఖ ల్యాబ్‌కు పంపనున్నట్లు సీఐ వెంకటరామిరెడ్డి తెలిపారు. గత ఐదేళ్లుగా ఈ అక్రమ వ్యాపారం జరుగుతున్నట్లు సమాచారం ఉందని ఆయన చెప్పారు. ఈ ఘటనపై సమగ్ర విచారణ చేసి ఈ అక్రమ వ్యాపారంలో ఎవరున్నది గుర్తిస్తామని, దీనివెనుకాల ఎంతటి వారున్న కేసులు నమోదు చేస్తామని సీఐ వెంకటరామిరెడ్డి తెలిపారు.

అలా.. దొరికిపోయాడు..

- ఉద్యోగాలు ఇప్పిస్తానని డబ్బు వసూలు
- ధర్మవరం రైల్వే స్టేషన్‌లో గుర్తింపు
- పోలీసులకు అప్పగించిన బాధితుడు



పోలీసుల అదుపులో ఉన్న ఉపేంద్ర

ధర్మవరం, ఆగస్టు 30: ఉద్యోగాలు ఇప్పిస్తానని డబ్బు వసూలు చేసి మోసం చేసిన వ్యక్తి అనుకోని విధంగా బాధితుడికి పట్టుబడ్డాడు. శ్రీసత్యసాయి జిల్లా ధర్మవరంలోని రైల్వేస్టేషన్‌లో శుక్రవారం కనిపించిన మోసగాడిని బాధితుడు పట్టణంలోని మారుతీనగర్‌కు చెందిన నరేశ్ పట్టుకుని, పోలీసులకు అప్పగించాడు. బాధితుడు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. నరేశ్ బీటెక్ చదివి, ఉద్యోగం కోసం ప్రయత్నిస్తుండేవాడు. ఈ నేపథ్యంలో కర్నూలు జిల్లా పత్తికొండ పట్టణానికి చెందిన వడ్డే ఉపేంద్ర ఆన్‌లైన్‌లో పరిచయమయ్యాడు. ప్రభుత్వ ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మబలికాడు. అతడి మాటలు నమ్మి నరేశ్ రూ.1.50 లక్షదాకా ఫోన్‌పే ద్వారా చెల్లించాడు. అప్పట్నుంచి ఉపేంద్ర తప్పించుకు తిరుగుతున్నాడు. ఈ క్రమంలో పనినిమిత్తం వేరే ప్రాంతానికి వెళ్లడానికి కుటుంబసభ్యులతో నరేశ్ శుక్రవారం స్థానిక రైల్వేస్టేషన్‌కు చేరుకున్నాడు. అక్కడ ఉపేంద్ర కనిపించడంతో చాకచక్యంగా పట్టుకుని, రైల్వేపోలీసుల వద్దకు తీసుకెళ్లాడు. వారి సలహా మేరకు టూటౌన్ పోలీసులకు అప్పగించాడు. ఉపేంద్ర 20 మంది నిరుద్యోగుల నుంచి రూ.50లక్షలదాకా వసూలు చేసినట్లు తెలుస్తోంది. అతడిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఎవరెవరి నుంచి ఎంత డబ్బు వసూలు చేశాడోనన్న వివరాలు రాబడుతున్నట్లు తెలుస్తోంది.

కుక్కల దాడిలో 20 గొర్రెలు మృతి

కోసిగి, ఆగస్టు 30: కోసిగి మండల పరిధిలోని గౌడుగల్లు చెరువు సమీపంలో పెద్దకడుబూరు మండలం పీకల బెట్ట గ్రామానికి చెందిన మహేంద్ర అనే రైతుకు చెందిన 20 గొర్రెలు కుక్కల దాడిలో మృతి చెందాయి. దాదాపు రూ.2.50 లక్షలు నష్టం జరిగినట్లు రైతు మహేంద్ర తెలిపారు. శుక్రవారం సాయంత్రం గౌడుగల్లు చెరువు సమీపంలో గొర్రెలు మేపడానికి వెళ్లగా.. 5 గొర్రెలు, 15 గొర్రె పిల్లలు ఒక చోట ఉంచడంతో అక్కడ ఎవరూ లేకపోవడంతో మూడు కుక్కలు వాటిపై దాడి చేసి చంపేసినట్లు రైతు తెలిపారు. ప్రభుత్వం ఆదుకోవాలని రైతు కోరారు.

ధాన్యం వ్యాపారి కుచ్చుటోపి

- రూ.3కోట్ల వరకు రైతులకు అప్పులు
- ఐదు రోజుల క్రితం పరారైన వైనం

కొలిమిగుండ్ల, ఆగస్టు 30: రైతుల నుంచి ధాన్యం సేకరించి, రూ.3కోట్ల వరకు అప్పులు చేసి ఓ వ్యాపారి ఉడాయించిన ఘటన కొలిమిగుండ్ల మండలంలో వెలుగు చూసింది. మండలంలోని తిమ్మనా యినిపేట గ్రామంలో గత 20ఏళ్లుగా నివాసం ఉంటూ ధాన్యం వ్యాపారం చేస్తున్న కోటేశ్వర రావు గత ఐదు రోజులుగా ఊరు విడిచి వెళ్లడంతో రైతులు లబోదిబో మంటున్నారు. మండలంలోని వివిధ గ్రామాల్లో రైతుల నుంచి ధాన్యం సేకరించిన అప్పులు రూ.3కోట్లు ఉన్నట్లు స్థానికులు అంచనా వేస్తున్నారు. మండలంలోని మీర్జాపురం, నందిపాడు, కల్వటాల, నాగిశెట్టిపల్లె, తిమ్మనా యినిపేట తదితర గ్రామాల రైతుల నుంచి ధాన్యంతోపాటు, అప్పుగా సేక రించిన బకాయిలు రూ.3కోట్లు పైగానే ఉంటుందని రైతులు పేర్కొం టున్నారు. అప్పులు చెల్లించే సమయం దగ్గర పడటంతో కోటేశ్వరరావు ఐదు రోజుల క్రితం అర్ధరాత్రి సామగ్రితో ఉడాయించినట్లు స్థానికులు తెలి పారు. కోటేశ్వరరావు కనిపించకుండా పోవడం, కుటుం సభ్యులకు సం బంధించిన ఫోన్లు పని చేయకపోవడంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు. కొందరు రైతులు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

విద్యార్థి బస్సు రాకపోకలకు ఇబ్బందులు

- రహదారి పక్కనే అడ్డుగా గోడ నిర్మాణం



బస్సు రాకపోకలకు అడ్డుగా మారిన గోడ

కొలిమిగుండ్ల, ఆగస్టు 30: మండలంలోని చింతలాయపల్లె గ్రామంలో రహదారి పక్కనే ఓ ఇంటి యజమాని గోడ కట్టడంతో విద్యార్థి బస్సు రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. కొలిమిగుండ్ల మోడల్ స్కూల్‌కు వచ్చే విద్యార్థుల కోసం ఆర్టీసీ కొలిమిగుండ్ల నుంచి, ఇటిక్యాల, చింతా లాయపల్లె మీదుగా ఉమ్మాయిపల్లె వరకు విద్యార్థి బస్సును ఏర్పాటు చేసింది. ఐదు గ్రామాలకు చెందిన సుమారు 60మంది విద్యార్థులు ఈ బస్సులో మోడల్‌స్కూల్‌కు వచ్చి విద్యనభ్యసిస్తున్నారు. అయితే విద్యార్థి బస్సు మాత్రమే రాకపోకలు సాగించే ఈ రహదారిలో చింతలాయపల్లె గ్రామంలో ఓ వ్యక్తి రహదారి పక్కనే గోడ కట్టడంతోపాటు, రహదారిలో వాహనాలను అడ్డుగా పెట్టి, బస్సు రాకపోకలకు ఆటంకం కలిగిస్తున్నాడని విదార్థుల తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. అతనిపై చర్యలు తీసుకోవాలని కొలిమిగుండ్ల పోలీస్ స్టేషన్‌లో ప్రజలు ఫిర్యాదు చేశారు.

యూపీఎస్ విధానాన్ని వ్యతిరేకిస్తున్నాం

కలెక్టరేట్ ఎదుట యూటీఎఫ్ నిరసన

కర్నూలు(ఎడ్యుకేషన్), ఆగస్టు 30: కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన యూనైటెడ్ పెన్షన్ స్కీం విధానాన్ని వ్యతిరేకిస్తున్నామని ఏపీ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యూటీఎఫ్) రాష్ట్ర సహాధ్యక్షుడు కె.సురేష్ పేర్కొన్నారు. శుక్రవారం సాయంత్రం కలెక్టరేట్ ఎదుట గాంధీ విగ్రహం ముందు యూటీఎఫ్ జిల్లా కమిటి ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కె.సురేష్ కుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి నవీన్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నూతన పెన్షన్ విధానం ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఆమోదయోగ్యంగా లేదన్నారు. పెన్షన్ పొందడానికి 20 సంవత్సరాలు సరిపోతుందన్నారు. కొత్త విధానంలో మాత్రం 25 ఏళ్ల సర్వీస్‌గా నిర్ణయించడం అన్యాయమన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన ఈ విధానాన్ని రాష్ట్ర ప్రభుత్వం వ్యతిరేకించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూఆర్‌పి రవికుమార్, జిల్లా సహాధ్యక్షుడు హేమంత్ కుమార్, జిల్లా ఆర్థిక కార్యదర్శి యేహోషువ, రాష్ట్ర కౌన్సిలర్ జయరాజు, జిల్లా నాయకులు తిమ్మన్న, దుర్గాప్ర సాద్, మారెప్ప, హనుమంతు, కాంతారావు, సోమన్న, హనుమన్న పాల్గొన్నారు.

బొలెరోను ఢీకొన్న లారీ

మహిళకు గాయాలు

ఆస్పరి, ఆగస్టు 30 : మండలంలోని బినిగేర గ్రామ సమీపంలో ఆదోని, పత్తికొండ ఆర్‌అండ్‌బీ రోడ్డు పక్కలో ఆగి ఉన్న బోలెరో వాహనాన్ని వెనుక వైపు నుంచి ఆదోని నుంచి పత్తికొండ వైపునకు వెళ్తున్న లారీ బొలెరోను శుక్రవారం ఢీకొంది. బొలెరో వాహనంలో ఉన్న దుర్గ అనే మహిళలకు తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం ఆదోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ రామాంజనేయులు తెలిపారు.

జీఎన్ఎం పరీక్షల్లో జోరుగా మాస్ కాపీయింగ్..!



జీఎన్ఎం పరీక్షలను తనిఖీ చేస్తున్న సీఎస్ఆర్ఎంవో

కర్నూలు(హాస్పిటల్), ఆగస్టు 30: కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో జరుగుతున్న జీఎన్ఎం నర్సింగ్ సప్లిమెంటరీ పరీక్షల్లో మాస్ కాపీయింగ్ జోరుగా సాగుతోంది. ఈ నెల 27 నుంచి సెప్టెంబరు 4వ తేదీ వరకు ఈ పరీక్షలను కర్నూలు మెడికల్ కాలేజీ, కర్నూలు జీజీహెచ్‌లో నిర్వహిస్తున్నారు. కర్నూలు, కడప, అనంతపురం జిల్లాల నుంచి 50 నర్సింగ్ స్కూల్స్ నుంచి విద్యార్థులు సుమారు 400 నుంచి 470 మంది హాజరవుతున్నారు. అయితే రెండు రోజులుగా ఈ పరీక్షల్లో కొందరు విద్యార్థులు మైక్రోజిరాక్స్ పేపర్లను చూసిరాస్తున్నట్లు సమాచారం. ఇందుకు అధికారులు కొందరు ఇన్విజిలేటర్లు, నర్సింగ్ ట్యూటర్లు, మాస్ సహకరిస్తున్నట్లు తెలుస్తోంది. కర్నూలు జీజీహెచ్‌లో పరీక్షలకు సంబంధం లేని ఓ క్లర్క్‌కు కాసుల కురిపిస్తున్నాయి. కొన్ని స్కూల్స్ నుంచి పరీక్షలు రాసే విద్యార్థుల సంఖ్యను బట్టి ముక్కు పిండి వసూలుకు పాల్పడుతున్నారన్న విమర్శలున్నాయి.. శుక్రవారం కర్నూలు మెడికల్ కాలేజీలో పరీక్ష కేంద్రాల బయట కుప్పలు కుప్పలుగా మైక్రో జిరాక్స్ చీటీలు పడి ఉండటం చూస్తే మాస్ కాపీయింగ్ ఎంతగా జరుగుతుందో తెలుస్తోంది.

నర్సింగ్ ట్యూటర్ల తొలగింపు

నర్సింగ్ ట్యూటర్ల తొలగింపు



కర్నూలు మెడికల్ కాలేజీలో మైక్రో జిరాక్స్ కాపీలు

మాస్ కాపీయింగ్‌పై కర్నూలు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ సి.ప్రభాకర్ రెడ్డి సాయంత్రం సమీక్ష నిర్వహించారు. నర్సింగ్ స్కూల్ ప్రిన్సిపాల్ వినోదిని, సీఎస్ఆర్ఎంవో , నర్సింగ్ సూపరింటెండెంట్‌తో సమావేశం ఏర్పాటు చేశారు. నర్సింగ్ ట్యూటర్లను జీఎన్ఎం సప్లిమెంటరీ పరీక్షల నుంచి తొలగిస్తూ సూపరింటెండెంట్ ఆదేశాలు జారీ చేశారు. వారి స్థానంలో స్టాఫ్ నర్సులను ఇన్విజిలేటర్లుగా రోజు మార్చి రోజు వేయాలని నర్సింగ్ సూపరింటెండెంట్ సావిత్రిబాయికి ఆదేశాలు జారీ చేశారు. జీఎన్ఎం పరీక్షలకు నలుగురు అధికారులను ఎగ్జామినర్లుగా నియమించారు. సీఎస్ఆర్ఎంవో డాక్టర్ వెంకటేశ్వర్లు, చీఫ్ ఎగ్జామినర్‌గా డిప్యూటీ సీఎస్ఆర్ఎంవో హేమనళిని, హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్ కిరణ్ కుమార్, నర్సింగ్ స్కూల్ ప్రిన్సిపాల్ వినోదిని, పరీక్ష ఎగ్జామినర్లుగా సూపరింటెండెంట్ నియమించారు. ప్రతి 45 నిమిషాలకు ఒకసారి అధికారి మారుతూ పర్యవేక్షించాలన్నారు. అలాగే ఈ పరీక్ష కేంద్రాలకు సంబంధం లేని క్లర్కులు వెళ్లకూడదని సూపరింటెండెంట్ హెచ్చరించారు.

నంద్యాల

నంద్యాల, నందికొట్కూరు, శ్రీశైలం, పాణ్యం

'దోమల నివారణకు చర్యలు'



మురుగునీటిలో ఆయిల్ బాల్స్ వేస్తున్న పంచాయతీ సిబ్బంది

పాణ్యం, ఆగస్టు 30: దోమల నివారణకు చర్యలు చేపడుతున్నట్లు ఈవోఆర్డీ సులోచన తెలిపారు. శుక్రవారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన 'గ్రామాలకు జ్వరం' అన్న కథనానికి స్పందించిన అధికారులు చర్యలు చేపట్టారు. శుక్రవారం ఈవోఆర్డీ సులోచన ఆధ్వర్యంలో అయ్యపురెడ్డి కాలనీ సమీపంలోని దేవదాయ శాఖ స్థలంలో నిలిచిన మురుగునీటిలో ఆయిల్ బాల్స్ వేశారు. దేవదాయశాఖ ఈవో సువర్ణకు సమస్యను వివరించి పరిష్కార మార్గాలు చేపట్టాలన్నారు. దీనిపై ఈవో దేవదాయ శాఖ ఉన్నతాధికారులకు సమస్యను వివరించామని, త్వరలో మురుగు తరలింపు చర్యలు చేపడతామని చెప్పారు. స్థలంలోని ఏపుగా పెరిగిన కంపచెట్లు తొలగించడంతో నీరు ఎండిపోవచ్చని పంచాయతీ ఈవో ఆనందరావు తెలిపారు. దోమల నివారణకు, మురుగు తొలగించడానికి వెంటనే ఇంకుడు గుంతలు తీయడానికి చర్యలు చేపడతామన్నారు.

3 నుంచి 'పొలం పిలుస్తోంది': కలెక్టర్

నంద్యాల (కల్చరల్), ఆగస్టు 30: రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు వచ్చే నెల 3 నుంచి జిల్లాలో 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం చేపడుతున్నట్లు కలెక్టర్ రాజకుమారి తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో పొలం పిలుస్తోంది కార్యక్రమ గోడపత్రికను వ్యవసాయ, వ్యవ సాయ అనుబంధ రంగాల అధికారులతో కలిసి ఆవిష్కరించారు. వ్యవసాయ, వ్యవసాయ అనుబంధ రంగాల అధికారులు పాల్గొన్నారు.

గూగుల్ ఆర్గనైజర్‌గా ఆర్జీఎం విద్యార్థిని

పాణ్యం, ఆగస్టు 30: గూగుల్ డెవలపర్ గ్రూప్ ఆన్ క్యాంపస్ ఆర్గనైజర్‌గా ఆర్జీఎం ఇంజనీరింగ్ కళాశాల డేటా సైన్స్ విద్యార్థిని సాయిలక్ష్మి ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ జయచంద్రప్రసాద్ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ గూగుల్ డెవలపర్ ఆన్ క్యాంపస్‌లో భాగంగా ఆర్జీఎం సీఈటీ కళాశాలను ఎంపిక చేశారన్నారు. గూగుల్ సంస్థ ఏర్పాటు చేసిన ఈ క్లబ్ ద్వారా విద్యార్థులు కోడింగ్ నైపుణ్యాన్ని మెరుగుపర్చుకోవచ్చని తెలిపారు. కళాశాల ఛైర్మన్ డాక్టర్ శాంతిరాముడు, ఎండీ శివరాం, డీన్ డాక్టర్ అశోక్‌కుమార్‌విద్యార్థిని అభినందించారు. హెచ్‌వోడీ భాస్కరరావు, అధ్యాపకులు పాల్గొన్నారు.

పౌర హక్కులపై అవగాహన

నందికొట్కూరు రూరల్, ఆగస్టు 30: శాతనకోట గ్రామంలో పౌరహక్కుల దినోత్సవం సందర్భంగా నందికొట్కూరు తహసీల్దార్ శ్రీనివాసులు, రూరల్ సీఐ సుబ్రహ్మణ్యం, బ్రాహ్మణకొట్కూరు ఎస్ఐ తిరుపాలు గ్రామస్థులకు అవగాహన కల్పించారు. సీఐ సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ ప్రాథమిక హక్కులకు భంగం కల్గిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో అధికారులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

'హమాలీలకు సమగ్ర చట్టం రూపొందించాలి'

ఆత్మకూరు, ఆగస్టు 30: హమాలీల సంక్షేమం కోసం సమగ్ర చట్టంతో పాటు వెల్ఫేర్ బోర్డును, సంక్షేమ నిధిని ఏర్పాటు చేయాలని సీఐటీయూ నాయకులు రజాక్, రణధీర్, రామ్‌నాయక్ కోరారు. పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. సమావేశంలో నాయకులు రఫీ, హుసేన్‌బాషా, మాబాషా, నరసింహారెడ్డి, మౌలాలి తదితరులు ఉన్నారు.

'కూటమి ప్రభుత్వంతోనే ప్రజా సంక్షేమం'



నంద్యాలలో పర్యటిస్తున్న ఎన్ఎండీ ఫిరోజ్

నంద్యాల, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంతోనే అభివృద్ధి, ప్రజా సంక్షేమం సాధ్యమని టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండీ ఫిరోజ్ అన్నారు. శుక్రవారం నంద్యాలలో ఫరూక్‌నగర్, క్రాంతి నగర్ వార్డుల్లో ఆయన పర్యటించారు. వార్డుల్లోని సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఆ వార్డుల ఇన్‌చార్జిలు బూత్ కన్వీనర్లు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

సారా పట్టివేత

మిడుతూరు, ఆగస్టు 30: నాగలూటి గ్రామ సమీపంలోని క్యాంపు వద్ద నందికొట్కూరు పట్టణ నీలి సికారి వంశీ సారా విక్రయిస్తుండగా ఎస్ఐ ఓబులేసు వారి సిబ్బందితో దాడి చేశారు. వంశీ వద్ద 10 లీటర్ల నాటు సారను స్వాధీనం చేసుకొని అతడిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరిచినట్లు ఎస్ఐ తెలిపారు.

గడివేముల: మండలంలోని గడిగరేవుల గ్రామంలో సారా విక్రేత శ్రీకృష్ణను శుక్రవారం అరెస్టు చేసినట్లు ఎస్ఐ నాగార్జున్‌రెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు గడిగరేవుల గ్రామంలో సార విక్రయిస్తుండగా విశ్వసనీయ సమాచారం మేరకు దాడులు నిర్వహించి శ్రీకృష్ణను అదుపులోకి తీసుకున్నామని చెప్పారు. అతడి వద్ద ఉన్న 5 లీటర్ల సారాను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

నంద్యాల (నూనెపల్లె), ఆగస్టు 30: నంద్యాల టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో పేకాటరాయుళ్లను అరెస్ట్ చేసినట్లు టూటౌన్ సీఐ ఇస్మాయిల్ తెలిపారు. శ్రీనివాస నగర్‌లోని ఓ గదిలో పేకాట ఆడుతున్నారన్న సమాచారం పోలీసులకు రావడంతో దాడులు చేశారు. ఈ దాడుల్లో 9 మంది పేకాటరాయుళ్లను అదుపులోకి తీసుకుని వారి వద్ద ఉన్న రూ 13 వేలు స్వాధీనం చేసుకున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

మహిళ ఆత్మహత్యాయత్నం

పాణ్యం, ఆగస్టు 30: కొండజూటూరు గ్రామానికి చెందిన ఎక్కలూరి వెంకటలక్ష్మి శుక్రవారం ఆత్మహత్యాయత్నం చేశారు. ఎస్ఐ నరేంద్రకుమార్ రెడ్డి తెలిపిన వివరాలివీ.. వెంకటలక్ష్మి భర్త వెంకటస్వామి తొమ్మిదేళ్ల క్రితం మృతి చెందారు. అయితే ఆస్తి ఇవ్వకుండా తమ మామ పుల్లయ్య, ఆయన చిన్న కుమారుడు నారాయణతో కలిసి వేధిస్తున్నారని శుక్రవారం మాత్రలు మింగి ఆత్మహత్యాయత్నం చేశారు. అపస్మారక స్థితిలో ఉన్న ఆమెను నంద్యాల ప్రభుత్వాసుపత్రికి తరలించినట్లు తెలిపారు. ప్రస్తుతం ఆమె పరిస్థితి ఆందోళనకరంగా ఉన్నట్లు తెలిపారు. కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ఘనంగా వన మహోత్సవం





మహానంది మండలంలోని గాజులపల్లి ఆర్ఎస్‌లో ర్యాలీ, ఆత్మకూరులోని డిగ్రీ కళాశాలలో మొక్కను నాటుతున్న అటవీ అధికారులు

మహానంది, ఆగస్టు 30: మహానంది మండలం గాజులపల్లి ఆర్ఎస్‌లో అటవీశాఖ శుక్రవారం ఘనంగా వనమహోత్సవం కార్యక్రమం నిర్వహించింది. చలమ రేంజ్ ఆఫీసర్ ఈశ్వరయ్య ఆధ్వర్యంలో గ్రామంలోని రామాలయం ఆవరణలో వివిధ రకాల మొక్కలను నాటారు. అంతకముందు వనమహోత్సవంలో భాగంగా గ్రామంలోని ప్రజలతో కలసి అధికారులు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ అస్లాం బాషా, ఈవోఆర్డీ శివనాగజ్యోతి, ఉపాధి హామీ పథకం ఏపీఎం మనోహర్, పంచాయతీ కార్యదర్శి కలువ బాస్కర్, ఫారెస్ట్ ఆఫీసర్ కిషోర్, ఖాశీం నాయక్, సిబ్బంది పాల్గొన్నారు.

ఆత్మకూరు: పర్యావరణ పరిరక్షణలో భాగంగా మొక్కలు నాటడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని ఆత్మకూరు ప్రాజెక్ట్ టైగర్ డిప్యూటీ డైరెక్టర్ విసాయిబాబా అన్నారు. వన మహోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం పట్టణ శివారులోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. అనంతరం కళాశాల ప్రాంగణంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో ఆత్మకూరు రేంజ్ అధికారి పట్టాభి, కళాశాల ప్రిన్సిపల్ జిష్ణు నాగవిజయ్, వైస్ ప్రిన్సిపాల్ పద్మావతిబాయి, అధ్యాపకులు తదితరులు ఉన్నారు.

వెలుగోడు: ప్రతి ఒక్కరూ కనీసం ఒక మొక్కను నాటి పరిరక్షించాలని అటవీశాఖ అధికారి ఎంఏ ఖాన్ అన్నారు. కేజీబీవీలో వన మహోత్సవాన్ని నిర్వహించారు. మొక్కలు నాటి నీరు పోశారు. కేజీబీవీ పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీనిజ పాల్గొన్నారు.

సామూహిక వరలక్ష్మీ వ్రతం



శ్రీశైలంలో పూజలు చేస్తున్న అర్చకులు



వరలక్ష్మీ వ్రతంలో పాల్గొన్న మహిళలు

శ్రీశైలం, ఆగస్టు 30: శ్రీశైల మహాక్షేత్రంలో నాలుగో శ్రావణ శుక్రవారాన్ని పురస్కరించుకుని సామూహిక వరలక్ష్మీ వ్రతాన్ని దేవస్థానం ఘనంగా నిర్వహించింది. ఈ వ్రతాన్ని ఆలయ ఉత్తర ద్వారం ఎదురుగా ఉన్న చంద్రావతి కళ్యాణ మండపంలో నిర్వహించారు. ముందుగా కార్యక్రమం నిర్విఘ్నంగా జరగాలని మహాగణపతికి ప్రత్యేక పూజలు జరిపి, అనంతరం వేదికపై ఆశీనులనుజేసిన స్వామి, అమ్మవర్లకు శాస్త్రోక్తంగా షోడశోపచార పూజలు నిర్వహించారు. వరలక్ష్మీవ్రతంలో భాగంగా భక్తులతో వ్రతాన్ని ప్రారంభించారు. అనంతరం ఆలయ అర్చకులు వ్రతకథను పఠించి వ్రతమహిమా విశేషాలను భక్తులకు వివరించారు. ఈ వరలక్ష్మీవ్రతంలో పాల్గొనేందుకు చెంచులను ప్రత్యేకంగా ఆహ్వానించారు. ఇందులో 600 మందికి పైగా చెంచులు, 900 మంది ఇతరులు మొత్తం 1500 మందికి పైగా పాల్గొన్నారు. వ్రతంలో పాల్గొన్న ముత్తైదులందరికీ వ్రతానికి సంబంధించిన పూజాద్రవ్యాలన్నింటినీ దేవస్థానం సమకూర్చింది. అదేవిధంగా వరలక్ష్మీవ్రతంలో పాల్గొన్న వారికి అమ్మవారి శేషవస్త్రాలుగా చీర, రవికవస్త్రం, పూలు, గాజులు, ప్రసాదాలు, శ్రీశైలప్రభ సంచికను అందజేశారు. వ్రతం అనంతరం వారికి స్వామి, అమ్మవార్ల దర్శనం కల్పించడంతో పాటు దేవస్థానం అన్నపూర్ణ భవనంలో అన్నప్రసాదాలను అందజేశారు. ఈ వ్రత మహోత్సవంలో ఆలయ కార్యనిర్వహణాధికారి డి. పెద్దిరాజు దంపతులు పాల్గొన్నారు. ఈ వ్రత మహోత్సవాన్ని భక్తులందరూ సౌకర్యవంతంగా వీక్షించేందుకు వీలుగా ఐదు ఎల్ఈడీ స్క్రీన్లను ఏర్పాటు చేశారు.

'సేంద్రియ ఎరువులు వాడాలి'

వెలుగోడు, ఆగస్టు 30: సేంద్రియ ఎరువులు వాడాలని, దీనివల్ల పురుగు మందుల అవశేషాలు లేని నాణ్యమైన ఆహారుత్పత్తులు సాధించవచ్చని ఆత్మకూరు ఏడీఏ ఆంజనేయ, ఏవో పవన్‌కుమార్ తెలిపారు. మండలంలోని గుంతకందాల గ్రామంలో శుక్రవారం పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో రైతు సేవా కేంద్రం సిబ్బంది అక్బర్ అలి, రామకృష్ణ, వెంకటశివ, స్వర్ణరూప, రైతులు పాల్గొన్నారు.

కొత్తపల్లి: పాలెంచెరువులో మండల వ్యవసాయాధికారి మహేష్ ఆధ్వర్యంలో పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. క్షేత్ర స్థాయిలో రైతులతో కలిసి పొలం బడి కార్యక్రమాన్ని నిర్వహించారు.అనంతరం ఆయన గువ్వలకుంట్ల రైతుభరోసా కేంద్రాన్ని తనిఖీ చేసి పంట నమోదు, ఈకేవైసీ త్వరగా పూర్తి చేయాలని సిబ్బందిని ఆదేశించారు. వ్యవసాయ సహాయకులు షేక్ జాహీద్ పాల్గొన్నారు.

ఆలయాల్లో చోరీ

మిడుతూరు, ఆగస్టు 30: చింతలపల్లి గ్రామంలో వెలిసిన సాయిబాబ ఆలయంలో గురువారం రాత్రి చోరీ జరిగింది. ఆలయంలోని హెండీని గుర్తు తెలియని వ్యక్తులు పగలకొట్టి అందులో ఉన్న నగదును చోరీ జరిగినట్లు గ్రామ ప్రజలు తెలిపారు. విషయం తెలుసుకున్న పోలీసులు చింతలపల్లి గ్రామం చేరుకుని ఆలయంలో పరిశీలించారు. అలాగే రోళ్లపాడు గ్రామంలో శుక్రవారం మారెమ్మగుడిలో దొంగతనం జరిగింది. అలగనూరు రోడ్డులో ఉన్న మారెమ్మ గుడిలో గుర్తుతెలియని వ్యక్తులు అమ్మవారికి చెందిన నాలుగు జతల బంగారు ముక్కురాళ్లు, అమ్మవారి చీరలు కంచార్తులు దొంగలించినట్లు గ్రామస్థులు తెలిపారు. అనుమానస్పదంగా తిరుగుతున్న వ్యక్తులను గ్రామ పెద్దలు గమనించి పోలీసులకు సమాచారం అందించినట్లు గ్రామస్థులు తెలిపారు.

'రెవెన్యూ సమస్యలు పరిష్కరించాలి'

మహానంది, ఆగస్టు 30: మహానంది మండలం లోని గ్రామాల్లో ఉన్న రెవిన్యూ సమస్యల పరిష్కారానికి కృషి చెయ్యాలని టీడీపీ మండల నాయకులు గని చిన్న రంగస్వామి కోరారు. శుక్రవారం మహానందిలోని మండల తహసీల్దార్ కార్యాలయంలో ఇటీవలనే బాధ్యతలు స్వీకరించిన తహసీల్దార్ రమాదేవిని ఆయన మర్యాదపూర్వకంగా కలిశారు. గోపవరం మాజీ ఎంపీటీసీ కృపవరం, ఎమ్మార్పీఎస్ నాయకులు చెన్నయ్య ఉన్నారు.

'పొలం దారులను మూసివేశారు'

పాణ్యం, ఆగస్టు 30: పిన్నాపురంలో పొలలాకు వెళ్లే దారులను గ్రీన్‌కో సంస్థ మూసివేసిందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం రైతులు తహసీ ల్దారు నరేంద్రనాథ్‌రెడ్డికి వినతిపత్రం అందించారు. వందేళ్లకు పూర్వ నుంచి గని పొలిమేరలోని చింతలచెరువు భూములకు పిన్నాపురం నుంచి పొలా రస్తా ఉందన్నారు. రెండు వారాల క్రితం గ్రీన్‌కో సోలార్ పనుల్లో భాగంగా పొలం రస్తాను మూసివేశారన్నారు. ప్రత్యామ్నయంగా మూడు కిలో మీటర్ల దూరం నుంచి పంటపొలాలకు వెళ్లాలని, రైతులకు రహదారి లేదని దౌర్జన్యంగా మూసి వేశారన్నారు. సర్వేయర్‌తో పరిశీలించి చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు.

'మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలి'

గోస్పాడు, ఆగస్టు 30: మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలని ఏపీఎం రామశేఖర్‌రెడ్డి సూచించారు. మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలిగా జిల్లెల్ల గ్రామానికి చెందిన గొటికె లక్ష్మి రమాదేవి ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు తెలిపారు. మండలంలో మొత్తం 36 గ్రామైక్య సంఘాలు ఉండగా శుక్రవారం మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలి ఎన్నికకు 25 గ్రామైక్య సంఘాల అధ్యక్షులు హాజరై ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. మండలంలో పొదుపు సంఘాల మార్పులు, చేర్పులు అన్నీ నిబంధనలకు లోబడే జరుగుతున్నాయని, ఎక్కడా రాజకీయ ప్రమేయం లేదని ఏపీఎం తెలిపారు. నూతన అధ్యక్షురాలు లక్ష్మి రమాదేవి మాట్లాడుతూ పొదుపు మహిళలు సకాలంలో లోన్లు చెల్లించి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో వెలుగు సీసీలు శ్రీనివాసులు, శ్యామ్, తదితరులు పాల్గొన్నారు.

'మంత్రిపై ఆరోపణలు సరికాదు'



మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

గోస్పాడు, ఆగస్టు 30: మంత్రి ఎన్ఎండీ ఫరూక్‌పై అవినీతి ఆరోపణలు చేయడం సరికాదని టీడీపీ మండల కన్వీనర్ కాటంరెడ్డి తులసీశ్వరరెడ్డి, నాయకులు అన్నారు. శుక్రవారం గోస్పాడులో టీడీపీ నాయకులతో కలిసి సమావేశం ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ కొన్ని రోజులుగా ఓ పత్రికలో మంత్రిపై ఆరోపణలు చేస్తుండడం దుర్మార్గమన్నారు.

పాఠశాలల తనిఖీ

గడివేముల, ఆగస్టు 30: మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాల, కేజీబీవీలో శుక్రవారం ప్రత్యేక అధికారి రామచంద్ర, ఎంపీడీవో శ్రీనివాసులు, తహసీల్దార్ విద్యాసాగర్ తనిఖీలు చేశారు. కేజీబీవీలో గ్రౌండ్ లెవెలింగ్ చేయించాలని, మెట్లకు గ్రిల్స్ ఏర్పాటు చేయాలని, ఇన్వర్టర్ సౌకర్యం కల్పించాలని విద్యార్థులు అధికారుల దృష్టికి తెచ్చారు. డిప్యూటీ తహసీల్దార్ గురునాథం, ఆయా పాఠశాలల హెచ్ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పాణ్యం: పాణ్యం గిరిజన గురుకుల పాఠశాలను తహసీల్దారు నరేంద్రనాథ్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ పాఠశాలలో విద్యార్థులకు అనుగుణంగా కావాల్సిన మరుగుదొడ్లు లేవన్నారు. అలాగే తరగతుల కొరతతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. వంట గది, డైనింగ్ హాల్‌ను పరిశీలించారు. ప్రిన్సిపాల్ కృష్ణానాయక్, ఆర్ఐ మహేశ్వరరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

కోతకు గురైన రహదారి

● పొలాల్లో నిలిచిన వర్షపు నీరు ● ఆందోళనలో రైతులు



నందికొట్కూరు-నాగలూటి క్రాస్ మధ్యలో పొలాల్లో నిలిచిన నీరు



కోతకు గురైన జాతీయ రహదారి

నందికొట్కూరు, ఆగస్టు 30: చిన్నపాటి వర్షం కురిస్తే చాలు 340-సి జాతీయ రహదారి కోతకు గురవుతోంది. వర్షం పడిన ప్రతి సారి మరమ్మతులు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. నందికొట్కూరు క్రాస్ నుంచి నాగలూటి క్రాస్ మధ్యలో రెండు కల్వర్టులను ఏర్పాటు చేశారు. వర్షపు నీరు ఎగువ ప్రాంతంలో కల్వర్టు ఏర్పాటు చేయడంతో కాలువ తీసినా కూడా నీరు వెళ్లడం లేదు. దీంతో పంట పొలాలు నీట మునుగుతున్నాయని రైతులు గగ్గోలు పెడుతున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్డు నీట మునిగిందని ఎక్స్‌కవేటర్‌తో కాలువ తీశారు. కాని వర్షపు నీరు వెళ్లడం లేదు. నందికొట్కూరు-నంద్యాల క్రాస్ వద్ద ఉన్న కల్వర్టు వరకు కాలువ తీస్తే దిగువకు వర్షపు నీరు వెళ్లి పోతుంది. ఈవిషయాన్ని గమనించి అధికారులు దిగువకు కాలువ తీసి తమ పొలాలు నీట మునగకుండా కాపాడాలని రైతులు కోరుతున్నారు. నందికొట్కూరు- నంద్యాల క్రాస్ వద్ద ఉన్న పంట పొలాలకు వెళ్లేందుకు రోడ్డు మార్గం లేదు. దీంతో 50 ఎకరాల రైతులు ఇబ్బందులకు గురవుతున్నారు. రోడ్డు నిర్మించాలని జాతీయ రహదారి అధికారులను కోరుతున్నా ఎవ్వరూ స్పందించడం లేదని రైతులు వాపోతున్నారు.

కల్వర్టులను సరైన ప్రదేశంలో నిర్మించలేదు



జాతీయ రహదారి ఎగువన నాకు పొలం ఉంది. ఈ వర్షాలకు ఎగువ ప్రాంతం నుంచి వర్షపు నీరు కిందకు వస్తుంది. కల్వర్టులను సరైన ప్రదేశంలో నిర్మించలేదు. దిగువకు వర్షపు నీరు వెళ్లేందుకు చర్యలు తీసుకోవాలి.

-రామచంద్రుడు, రైతు

రస్తా ఏర్పాటు చేయాలి



పొలానికి వెళ్లేందుకు గతంలో రస్తా ఉండేది. జాతీయ రహదారి నిర్మాణంతో రస్తా పోయింది. మా పొలంతో పాటు 50 ఎకరాల భూమికి రస్తా లేదు. జాతీయ రహదారి అధికారులను అడిగితే పట్టించుకోవడం లేదు. రోడ్డుకు పొలాన్ని సేకరించే సమయంలో రస్తా ఏర్పాటు చేస్తామని ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలి

- గౌస్ మోహిద్దీన్, రైతు

మహానందిలో ప్రముఖ ఆధ్యాత్మిక గురువు



మహానందిలో రాధా మనోహర్ ధాస్ స్వామీజీ

మహానంది, ఆగస్టు 30: మహానంది క్షేత్రంలో ప్రముఖ ఆధ్యాత్మిక గురువు, సనాతన హిందూ ధర్మ పరిరక్షకుడు రాధా మనోహర్ దాస్ స్వామీజీ శుక్రవారం పూజలు నిర్వహించారు. వీరికి ఆలయం వద్ద టెంపుల్ ఇన్‌స్పెక్టర్ మల్లికార్జున ఆధ్వర్యంలో అర్చకులు స్వాగతం పలికారు. అనంతరం స్వామిజీ ప్రధాన ఆలయాల్లో స్వామి,అమ్మవార్లకు ప్రత్యేక అభిషేకార్చనలు చేశారు. ఆలయ ప్రాంగణంలోని కల్యాణమంటపంలో ఏఈవో ఎర్రమల్ల మధు రాధా మనోహర్ దాస్ స్వామిజీని కండువాతో సన్మానించారు. వేదపండితులు ప్రసాదాలు అందజేశారు. వీరివెంట మహానంది విశ్వ హిందూ పరిషత్ సేవకులు భూమా సమీరా గుప్తా, భూమా గోపాల్ ఉన్నారు.

అమ్మవార్లకు ప్రత్యేక పూజలు



ఈవోకు బంగారు పాదుకలు అందిస్తున్న ఆరవేటి వాసు

నంద్యాల (కల్చరల్), ఆగస్టు 30: నంద్యాల పట్టణంలో వెలసిన అమ్మవార్లకు భక్తిశ్రద్ధలతో శ్రావణమాస చివరి శుక్రవారం సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. చివరి శుక్రవారం పురష్కరించుకొని కాళికాంబ చంద్రశేఖర స్వామి దేవస్థానంలోని కాళికాంబ అమ్మవారికి, టెక్కెలో వెలసిన సుంకులా పరమేశ్వరీదేవికి, ఆత్మకూరు బస్టాండువద్ద గల నిమిషాంబదేవి అమ్మవారికి, బస్టాండు దగ్గరలో వెలసిన చౌడేశ్వరీ అమ్మవారికి ఉదయం నుంచి సుప్రభాత సేవ, పంచామృత అభిషేకాలు నిర్వహించి అమ్మవార్లను ప్రత్యేక అలంకారంలతో అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. కాళికాంబ ఆలయ ఈవో లక్ష్మీ నారాయణ, ఆరవేటి వాసు, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

● నంద్యాలకు చెందిన ఆరవేటి వాసు తన తల్లితండ్రుల జ్ఞాపకార్థం 30 తులాల బంగారు పాదుకలు దాదాపు రూ.22లక్షల విలువ చేసే బంగారు పాదుకలను కాళికాంబ ఆలయ ఈవో లక్ష్మీనారాయణకు అందజేశారు. వాటిని అమ్మవారికి సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

మౌలాలి స్వామి ఉరుసు

కొత్తపల్లి, ఆగస్టు 30: కొత్తపల్లిలోని మొక్కుబడి మౌలాలి స్వామి ఉరుసు, చిన్న సరిగెత్తు వేడుకలు ఘనంగా నిర్వహించారు. స్థానిక తాండవ ఆలయ మల్లేశ్వరస్వామి ఆలయ పూర్వ అర్చకులు ఉమామహేశ్వర శర్మ సహకారంతో గ్రామస్థుల ఆధ్వర్యంలో మౌలాలి స్వామి చిన్నసరిగెత్తు నిర్వహించారు.

బాల్యవివాహ ఏర్పాట్లను అడ్డుకున్న అధికారులు

నందికొట్కూరు రూరల్, ఆగస్టు 30: నందికొట్కూరు మండలంలోని నాగటూరు గ్రామంలో బాల్య వివాహం చేయడానికి చేస్తున్న ఏర్పాట్లను ఐసీడీఎస్ అధికారులు, రెవెన్యూ, పోలీసులు అధికారులు అడ్డుకున్నారు. 8వ తరగతి చదువుకుంటున్న అమ్మాయికి అదే గ్రామానికి చెందిన యువకుడితో వివాహం చేయాలని నిశ్చయించుకున్నారు. నిశ్చితార్థం చేయడానికి కూడా ఏర్పాట్లు చేస్తున్నారన్న సమాచారం తెలుసుకున్న అధికారులు అక్కడికి వెళ్లి అమ్మాయి తరపువారికి అధికారులు కౌన్సెలింగ్ ఇచ్చి రద్దు చేయించామని ఐసీడీఎస్ సీడీపీవో కోటేశ్వరమ్మ, సూపర్‌వైజర్ అనూరాధ తెలిపారు. సూపర్‌వైజర్ మాట్లాడుతూ 13ఏళ్ల అమ్మాయికి వివాహం నిశ్చయం చేశారన్న సమాచారం మేరకు అక్కడికి వెళ్లి అమ్మాయి తరపు వారికి చైల్డ్ మ్యారేజ్ కమిటీ అధికారులు గ్రామ వీఆర్వో రషీద్, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ వర్కర్, గ్రామ పంచాయతీ కార్యదర్శి, అధికారులు కౌన్సెలింగ్ ఇచ్చినట్లు తెలిపారు. 18ఏళ్ల తర్వాతనే వివాహం చేస్తామని, అంతవరకు అమ్మాయిని చదివించుకుంటామని అమ్మాయి తరపువారు రాతపూర్వకంగా రాయించినట్లు అధికారులు తెలిపారు.

పొంచి ఉన్న ప్రమాదం



చేతికి అందే ఎత్తులో ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్

నంద్యాల రూరల్, ఆగస్టు 30: నంద్యాల మండలంలోని చాపిరేవుల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ప్రహరీని ఆనుకుని రోడ్డు, ఆస్పత్రి వైపు విద్యుత్ వైర్లు, ఫ్యూజ్ క్యారియర్లు కిందకు వేలాడుతున్నాయి. అంతేకాక ట్రాన్స్‌ఫార్మర్లను కూడా కిందనే ఏర్పాటు చేశారు. ఇక్కడికి ప్రజలు నిత్యం వైద్యం కోసం వస్తుంటారు. ప్రమాదం జరగకుండా విద్యుత్‌శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

అధ్వానంగా రోడ్డు



అధ్వానంగా మారిన ఓంకారం రోడ్డు

బండిఆత్మకూరు, ఆగస్టు 30: మండలంలోని ఓంకార క్షేత్రం చేరుకోవాలంటే భక్తులకు నరకయాతన తప్పడం లేదు. బండిఆత్మకూరు నుంచి 12 కిలోమీటర్ల దూరంలో నల్లమల అడవిలో ఓంకార క్షత్రం వెలసి ఉంది. ఈ క్షేనితాకి గతంలో ఒక లైను బీటీ రోడ్డు చాలా బాగా ఉండేది. అయితే 2018లో టీడీపీ ప్రభుత్వం ఈ రహదారిని డబుల్ రోడ్డుగా నిర్మించేందుకు రూ.19 కోట్ల మేర నిధులు మంజూరు చేసింది. అప్పట్లో ఉన్నదారిని తొలగించారు. 2019 మొదట్లో డబుల్ రోడ్డు పనులు ప్రారంభమయ్యాయి. 2019లో వైసీపీ అధికారంలోకి వచ్చిన అనంతరం పనులను వైసీపీ కట్టబెట్టినట్లు ఆరోపణలు వినిస్తున్నారు. గత ఐదు సంవత్సరాలు గడచినా పనులు మాత్రం ఎక్కడ వేసిన గొంగలి అక్కడే అన్న చందాన మారిపోయాయి. భక్తులు ఈ క్షేత్రానికి పలు ప్రాంతాల నుంచి తరలి వస్తుంటారు. ముఖ్యంగా శివరాత్రి, కార్తీకమాస వేడుకల సమయాల్లో లక్షలాది మంది భక్తులు ఓంకారం క్షేత్రానికి చేరుకుంటారు. అయితే క్షేత్రానికి వెళ్లే రోడ్డులో అడుగడుగునా గుంతలు దర్శనమిస్తాయి. ఇప్పటికైనా ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి ఈ రహదారిని పూర్తి చేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.

నల్లబ్యాడ్జీలతో ఎన్ఎంయూ నిరసన



ఆర్టీసీ డిపో ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

బనగానపల్లె, ఆగస్టు 30: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ బనగానపల్లె ఆర్టీసీ డిపో ఎదుట నేషనల్ మజ్దూర్ యూనియన్ నాయకులు శుక్రవారం నల్లబ్యా డ్జీలతో నిరసన వ్యక్తం చేశారు. ఈసందర్భంగా డిపో కార్యదర్శి శ్రీనివా సులు మాట్లాడుతూ ఆర్టీసీ డ్రైవర్లు, కండక్టర్లకు రాత్రి అలవెన్సులు ఇవ్వా లని డిమాండ్ చేశారు. అరియర్స్ సిక్ లీవుల, రిటైర్డు ఉద్యోగుల సెటి ల్‌మెంట్ బిల్లులు సకాలంలో చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్ర మంలో రీజనల్ కార్యదర్శులు ఎస్ఎస్ వలి, గఫార్, జమ్ములయ్య, ఓబు లేసు, వెంకటేశ్వర్లు, ఆర్టీసీ కార్మిక నాయకులు ఏ.బాబు, జీఎండీ రఫీ, కె.బాబు తదితరులు పాల్గొన్నారు.

చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి: సీఐ



తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్న సీఐ ఇంతియాజ్ బాషా

డోన్(రూరల్), ఆగస్టు 30: విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని పట్టణ సీఐ ఇంతియాజ్ బాషా అన్నారు. శుక్రవారం పట్టణ సమీపంలోని ఏపీ మోడల్ స్కూల్‌లో ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా సీఐ హాజరై మాట్లాడుతూ చదువుతోనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందన్నారు. కార్యక్రమంలో కేవీఎస్ ఆసుపత్రి గైనకాలజిస్టు డాక్టర్ దీపిక, కళాశాల ప్రిన్సిపాల్ నాగజాస్మిన్, ఏపీ మహిళా సమైఖ్య నాయకురాలు షమీమ్ బేగం, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు సూర్యప్రతాప్ పాల్గొన్నారు.

భోజనంలో పరిశుభ్రతను పాటించాలి

ప్యాపిలి, ఆగస్టు 30: భోజనంలో పరిశుభ్రతను పాటించాలని ఈవోఆర్డీ బాలక్రిష్ణుడు సూచించారు. శుక్రవారం పట్టణంలోని కేజీబీవీ, ఎస్సీ బాలికల వసతి భవనాలను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఈవోఆర్డీ మాట్లాడుతూ ప్రస్తుత సీజన్‌లో వ్యాధులు ప్రబలుతున్నాయన్నారు. వ్యాధులపై బాలికలకు అవగాహన కల్పించాలన్నారు. ఎస్సీ బాలికల వసతి భవనంలో వసతులు సరిగా లేవని, కనీసం మంచి నీటి సౌకర్యం లేదని విద్యార్థినులు ఈవోఆర్డీ ఎదుట వాపోయారు. అలాగే కేజీబీవీలో కోతుల బెడద, రోడ్డు ఏర్పాటు చేయాలని సిబ్బంది, బాలికలు ఆయన దృష్టి తీసుకొచ్చారు. కార్యక్రమంలో తహసీల్దారు భారతి, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారి ఇజ్రాయిల్ పాల్గొన్నారు.

నేడు వరదపాయస మహోత్సవం

డోన్(రూరల్), ఆగస్టు 30: మండలంలోని ఆవులదొడ్డి గ్రామ సమీపంలో కొండల్లో వెలసిన లక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం వరదపాయస మహోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు ధర్మకర్త ఆలా మోహన్ రెడ్డి తెలిపారు. మధ్యాహ్నం ఒంటి గంట నుంచి 4 గంటల వరకు వరద పాయస మహోత్సవం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో భక్తులు పాల్గొనాలని కోరారు.

వైభవంగా చౌడేశ్వరీదేవి పల్లకీ సేవ

బనగానపల్లె, ఆగస్టు 30: మండలంలోని నందవరం చౌడేశ్వరీ దేవి ఆలయంలో శుక్రవారం అమ్మవారికి పల్లకీసేవ వైభవంగా నిర్వ హించారు. ఆలయ ఈవో కామేశ్వరమ్మ, పూజారులు, భక్తుల ఆధ్వర్యంలో అమ్మవారిని పల్లకీలో ఊరేగించారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. అనంతరం అమ్మవారిని దర్శించుకున్నారు.

పంట నమోదు తప్పనిసరి : ఏవో

కోవెలకుంట్ల, ఆగస్టు 30: ఖరీఫ్‌లో సాగు చేసిన పంటలకు రైతులు పంట నమోదు తప్పనిసరిగా చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి నిరంజన్ తెలిపారు. శుక్ర వారం కోవెలకుంట్ల మండలంలోని చిన్నకొప్పెర్ల, సౌదరదిన్నె గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాలను సందర్శించి పంట నమోదును పరిశీలించారు.

నేత్రదానంపై అవగాహన

బనగానపల్లె, ఆగస్టు 30: పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాలలో కంటి వైద్యని పుణుడు డాక్టర్ బిచ్చయ్య ఆధ్వర్యంలో శుక్రవారం విద్యార్థినులకు నేత్రదానంపై అవగాహన సదస్సు నిర్వహించారు. డాక్టర్ బిచ్చయ్య బాలికలకు కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్ఎం గంగాధర్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మద్యం స్వాధీనం

కోవెలకుంట్ల, ఆగస్టు 30: రేవనూరు గామానికి చెందిన నరసింహులు అనే వ్యక్తిని అరెస్టు చేసి అతని వద్ద నుంచి 18 క్వార్టర్ మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ భూపాలుడు తెలిపారు. రేవనూరులో కొందరు వ్యక్తులు మద్యం విక్రయిస్తున్నట్లు సమాచారం రావడంతో దాడి చేసి మద్యం అమ్ముతున్న నరసింహులును అరెస్టు చేసి అతని వద్ద మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నామన్నారు.

క్రీడా ప్రతిభ అవార్డుపై హర్షం

దొర్నిపాడు, ఆగస్టు 30: మండలంలోని భాగ్యనగరం ఉన్నత పాఠశాలకు వరుసగా మూడో సారి క్రీడా ప్రతిభ అవార్డుకు ఎంపిక కావడంపై టీడీపీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. శుక్రవారం పాఠశాల ఆవరణలో టీడీపీ మండల కార్యదర్శి కొత్తపల్లి సురేంద్ర, అమరసింహారెడ్డి, హెచ్ఎం ఆదిలక్ష్మమ్మ ఆధ్వర్యంలో పీడీ శ్రీధర్‌ను సన్మానించారు.

ఘనంగా కృష్ణభగవానుడి గ్రామోత్సవం



ప్యాపిలిలో కృష్ణుడి గ్రామోత్సవంలో పాల్గొన్న అధికారులు

ప్యాపిలి, ఆగస్టు 30: పట్టణంలో శుక్రవారం కృష్ణుడి విగ్రహాన్ని పల్లకిలో ఉంచి గ్రామోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమం త్రైతసిద్ధాంతం ప్రబోధా నంద సేవా సమితి ఆధ్వర్యంలో జరిగింది. కార్యక్రమంలో తహసీల్దారు భారతి, డిప్యూటీ తహసీల్దారు మారుతి, ఆర్ఐ సుధాకర్‌రెడ్డి, సేవసమితి సభ్యులు కేశవులు, రమేష్ పాల్గొన్నారు.

కొలిమిగుండ్ల: మండలంలోని బందార్లపల్లె గ్రామంలో త్రైతసిద్ధాంతం ప్రబోధ సేవాసమితి, ఇందూ జ్ఞానవేదిక వారి ఆధ్వర్యంలో శ్రీకృష్ణుడి గ్రామోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. గ్రామ కమిటీ సభ్యులు రామకృష్ణ, రాజశేఖర్, మల్లికార్జున, రాజు, నాగ సుబ్బరాయుడు ఆధ్వర్యంలో శ్రీకృష్ణుడి ప్రతిమను పల్లకీలో ఉంచి గ్రామ వీధుల్లో గ్రామోత్సవం జరిపారు.



బందార్లపల్లెలో.

భావితరాల కోసం మొక్కలు నాటుదాం

ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి

డోన్, ఆగస్టు 30: భావితరాల కోసం ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం పట్టణంలోని ప్రభుత్వ ఐటీఐ రహదారిలో నిర్వహించిన వనం-మనం కార్యక్రమంలో భాగంగా నగర వనంలో ఎమ్మెల్యే మొక్కలు నాటారు. ఆయన మాట్లాడుతూ పర్యావరణాన్ని కాపాడుకునేందుకు విరివిగా మొక్కలు నాటుదామన్నారు. మున్సిపల్ కమిషనర్ జయరాం, మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేశ్, వైస్ చైర్మన్ కోట్రికే హరికిషణ్, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వలసల రామకృష్ణ, మాజీ సర్పంచ్ టీఈ కేశవయ్య గౌడు, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ లక్ష్మిరెడ్డి, మాజీ ఎంపీపీ శేషఫణిగౌడు, టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి విజయభట్టు, ఓబులాపురం శేషిరెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు శ్రీనివాసులు యాదవ్, టీఈ రాఘవేంద్రగౌడు, అన్వర్‌బాషా, బీజేపీ డోన్ నియోజకవర్గ కోఆర్డినేటర్ వడ్డె మహారాజ్, జనసేన నాయకులు బ్రహ్మం పాల్గొన్నారు.

సంజామల: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలని ఎంపీడీవో విజయ్ కుమార్‌రెడ్డి అన్నారు. వనం- మనంలో భాగంగా శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఎన్ఆర్ఈజీఎస్ ఏపీవో సూర్యప్రకాష్‌తో కలిసి ఎంపీడీవో నాటారు.



సంజామలలో..

చాగలమర్రి: చాగలమర్రిలోని వాసవీ ఎయిడెడ్ జూనియర్, డిగ్రీ జూనియర్ కళాశాలల్లో శుక్రవారం వన మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మొక్కలు నాటారు. కార్యక్రమంలో వాసవి ఎయిడెడ్ జూనియర్, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాళ్లు షాబుద్దీన్, ఓబులేసు, ఎన్ఎస్ఎస్ అధికారులు మహేశ్వరయ్య, శివరామిరెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రుద్రవరం: మొక్కలు నాటుదాం, పచ్చదన అభివృద్ధిని భవిష్యత్తు తరాలకు అందిద్దామని రేంజర్ శ్రీపతినాయుడు అన్నారు. వన మహోత్సవం సందర్భంగా నరసాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో సర్పంచ్ శాంతకుమారి రేంజర్ శ్రీపతినాయుడు, వైద్యాధికారి బాబులు మొక్కలు నాటారు. డిప్యూటీ రేంజర్ ముర్తుజావలి, సెక్షన్ ఆఫీసర్లు ముక్తియార్ బాషా, శ్రీనివాసరెడ్డి, కార్యదర్శి ప్రభాకర్, వీఆర్వో ఓబయ్య పాల్గొన్నారు.

మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలి: మంత్రి బీసీ

బనగానపల్లె: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలని రోడ్లు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం తిరుపతి అతిథి గృహం ఆవరణలో బీసీ ఇందిరమ్మ, కుటుంబసభ్యులతో కలసి మొక్కలు నాటారు. కార్యక్రమంలో సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం, ఆర్‌అండ్‌బీ డీఏలు, ఏఈలు పాల్గొన్నారు.



తిరుపతి ఆర్‌అండ్‌బీ అతిథి గృహం వద్ద మొక్కకు నీరు పోస్తున్న మంత్రి బీసీ, కుటుంబ సభ్యులు



డోన్‌లో మొక్కకు నీరు పోస్తున్న ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి



చాగలమర్రి మొక్క నాటుతున్న ప్రిన్సిపాల్, విద్యార్థులు



నరసాపురంలో మొక్క నాటుతున్న సర్పంచ్, రేంజ్ ఆఫీసరు

గ్రామాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం: ఎమ్మెల్యే

చాగలమర్రి, ఆగస్టు 30: గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ అన్నారు. శుక్రవారం చాగలమర్రి ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ వీరభద్రుడు అధ్యక్షతన జరిగిన మండల సమావేశంలో ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, టీడీపీ నాయకుల సమస్యలను పరిష్కరించాలని అధికారులకు సూచించారు. ప్రజలకు అందుబాటులో ఉండాలని అధికారులకు ఆదేశించారు. గత ప్రభుత్వంలో భూ రీసర్వేలో అవకతవకలు జరిగాయని ఆరోపించారు. సీఎం చంద్రబాబునాయుడు ఆళ్లగడ్డ అభివృద్ధి కోసం ప్రతి మండలానికి రూ.2.5 కోట్లు ఇచ్చారని, అంతేకాకుండా ఎమ్మెల్యే ఫండ్స్, సర్పంచ్ నిధులు మంజూరవుతాయని, వాటి ద్వారా అభివృద్ధి చేస్తామని అన్నారు. మురుగు కాలువలు, రహదారుల పనులు చేపడతామన్నారు. చాగలమర్రి మండలానికి రెండు కొత్త విద్యుత్ సబ్‌స్టేషన్‌లు మంజూరయ్యాయని తెలిపారు. విద్యుత్ సిబ్బంది కొరత ఉందని తన దృష్టికి తీసుకొచ్చారని, సిబ్బంది కొరతను తీరుస్తామని అన్నారు. మండలానికి 25 మినీ గోకులాలు ఇచ్చారని అన్నారు. మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడి మండలానికి 100 మినీ గోకులాలు కావాలని ప్రతిపాదనలు పంపామని చెప్పారు. బాలికల పాఠశాలల ప్రదేశాల్లో తన సొంత డబ్బులతో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయిస్తామని ఎమ్మెల్యే తెలిపారు. ప్రభుత్వ వైద్యశాలలో వైద్యులు అందుబాటులో ఉండి వైద్య సేవలు అందించాలన్నారు. ప్రతి నెల పింఛన్‌లను సక్రమంగా పంపిణీ చేయాలన్నారు. ఎమ్మెల్యే భూమా అఖిలప్రియను వివిధ శాఖల అధికారులు శాలువ, పూలమాలలతో సన్మానించారు. పశుసంవర్ధక శాఖ ఏడీ వరప్రసాద్, తహసీల్దార్ రవికుమార్, ఎంపీడీవో మహబూబ్‌దౌల, ఎంఈవోలు అనూరాధ, న్యామతుల్ల, వైద్యులు అంజలి, ఈవోఆర్డీ తాహిర్‌హుస్సేన్, ఏవో రంగనేతాజీ, ఏఈలు షాజహాన్, కొండారెడ్డి, జగ్గయ్య, ఏపీవో నిర్మల, ఆయా శాఖల అధికారులు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు. మండల సమావేశం వద్ద ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా ఆళ్లగడ్డ రూరల్ సీఐ కంబగిరిరాముడు, ఎస్ఐలు రమేష్‌రెడ్డి, హరిప్రసాద్ ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ

'ఎమ్మెల్యేను విమర్శించే అర్హత లేదు'



మాట్లాడుతున్న హరికుమార్‌రెడ్డి

ఆళ్లగడ్డ, ఆగస్టు 30: ఆళ్లగడ్డ ఎమ్మెల్యే అఖిలప్రియను విమర్శించే అర్హత కిశోర్‌రెడ్డికి లేదని ఆళ్లగడ్డ టీడీపీ మండల కన్వీనర్ శీలం హరికుమార్‌రెడ్డి అన్నారు. ఆళ్లగడ్డ పట్టణంలోని ఎమ్మెల్యే నివాసంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పబ్లిసిటీ కోసం పూనకం వచ్చినట్లు మీడియా ముందు మాట్లాడటం సరికాదని, అంతేకాకుండా వైసీపీ వారు రాసిచ్చిన స్క్రిప్టు చదవడం తప్ప ఏమీ లేదని అన్నారు. ఎమ్మెల్యే అనుచరులు అక్రమ వసూళ్లు చేస్తున్నారని ఆరోపిస్తున్నారని, వీటికి ఆధారాలుంటే బహిరంగ చర్చకు రావాలని సవాల్ విసిరారు. టీడీపీ కౌన్సిలర్ హుసేన్‌బాషా, మాజీ జడ్పీటీసీ చాంద్‌బాషా, మర్రిపల్లె పాపిరెడ్డి, మార్తల విష్ణువర్ధన్‌రెడ్డి, గూబగుండం సర్పంచ్ ఉపేంద్రారెడ్డి, అంజి తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి: సీఐటీయూ



మాట్లాడుతున్న సుధాకర్

కోవెలకుంట్ల, ఆగస్టు 30: స్వచ్ఛభారత్ కార్మికులకు పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలని సీఐటీయూ జిల్లా నాయకుడు సుధాకర్ కోరారు. శుక్రవారం కోవెలకుంట్ల పట్టణంలో స్వచ్ఛభారత్ కార్మికుల మండల కమిటీ జనరల్ బాడీ సమావే శం సీఐటీయూ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా సుధాకర్ మాట్లాడుతూ ఐదు నెలలుగా జీతాలు పడక స్వచ్ఛభారత్ కార్మికులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. అంతకు ముందుగా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా త్యాగరాజ్, కార్యదర్శిగా గంగన్న, కోశాధికారిగా తిరుపాల్, కమిటీ సభ్యులు అచ్చమ్మ, మరియమ్మ, జయన్న, భాస్కర్, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలను పట్టించుకోరా?

కౌన్సిల్ సమావేశంలో కమిషనర్‌పై సభ్యుల ధ్వజం

బేతంచెర్ల, ఆగస్టు 30: నగర పంచాయతీ పరిధిలోని ఆయా వార్డుల్లోని ప్రజలు వీధి దీపాలు, డ్రైనేజీ తదితర సమస్యలతో అల్లాడుతున్నా పట్టించుకోరా? అని కమిషనర్ రమేష్ బాబుపై ఆయా వార్డుల కౌన్సిలర్లు ధ్వజమెత్తారు. శుక్రవారం పట్టణంలోని నగర పంచాయతీ కార్యాలయంలో వైస్ చైర్మన్ నాగ వెంకటేశ్వర్లు అధ్యక్షతన కౌన్సిలర్ల సర్వసభ్య సమా వేశం జరిగింది. కౌన్సిలర్ ఇబ్రహీం మాట్లాడుతూ నగర పంచాయితీ స్థలాల్లో కబ్జా చేస్తున్న పట్టించుకునే వారే లేరని ఆరోపించారు. అలాగే తాగునీటి బోర్లలో భూగర్భ జలాలు అడుగంటడంతో ట్రాక్టర్లతో ప్రజలకు నీటిని సరఫరా చేస్తున్నామన్నారు. అలాగే కౌన్సిలర్ ఆదిలక్ష్మి మాట్లాడుతూ తమ వార్డు పరిధిలో వీధి దీపాలు లేక రాత్రివేళల్లో ప్రజలు బయటకు రాలేకపోతున్నారని కమిషనర్‌కు వివరించారు. సమావేశంలో కౌన్సిలర్ మహేశ్వరి, కోఆప్షన్ సభ్యులు ఎల్లయ్య కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అహోబిలంలో ప్రత్యేక పూజలు

ఆళ్లగడ్డ, ఆగస్టు 30: అహోబిలం లక్ష్మీనరసింహస్వామి సన్నిధిలో వేద పండితులు ఉత్సవమూర్తులకు ఏకాదశి పూజలను శుక్రవారం నిర్వహించారు. వేకువజామున్నే ఉత్సవమూర్తులకు పూలమాలలతో అలంకరించి పూజలు చేపట్టారు. అనంతరం ఉత్సవమూర్తులైన ప్రహ్లాదవరద స్వామి, శ్రీదేవి, భూదేవి అమ్మవార్లకు జలాభిషేకం చేశారు. వేదపండితులు భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు.

'టీడీపీతోనే రాష్ట్రాభివృద్ధి'

చాగలమర్రి, ఆగస్టు 30: టీడీపీతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని టీఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుత్తి నరసింహులు, బీసీ సంఘం గౌరవ అధ్యక్షుడు రామతీర్థం తెలిపారు. శ్రావణ శుక్రవారం సందర్భంగా చాగలమర్రి కుమ్మరికట్ట వీధిలో కొత్తగా ప్రతిష్ఠించిన నాగదేవత విగ్రహాలకు ప్రత్యేక పూజలు చేశారు. విగ్రహాలు ప్రతిష్ఠించి 21 రోజులు కావడంతో వేద పండితుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. టీడీపీ నాయకులు భాస్కర్ రెడ్డి, నరసింహారెడ్డి, జనసేన నాయకుడు సుబ్బయ్య, బీసీ సంఘ నాయకులు పీరయ్య, సుబ్బరాయుడు, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

'రూ.22.5 లక్షలతో గ్రంథాలయ నిర్మాణం'

చాగలమర్రి, ఆగస్టు 30: చాగలమర్రి ఎంపీడీవో కార్యాలయం సమీపంలో రూ.22.5 లక్షలతో గ్రంథాలయ భవన నిర్మాణ పనులు చేపడుతున్నట్లు ఏఈ హరీష్ శుక్రవారం తెలిపారు. గ్రంథాలయ భవన నిర్మాణానికి మార్కింగ్ ఇచ్చారు. ఏఈ మాట్లాడుతూ గ్రంథాలయం అద్దె భవనంలో నిర్వహిస్తున్నారని, పాఠకులకు ఇబ్బందిగా ఉండటంతో కొత్త భవన పనులు చేపడుతున్నామని తెలిపారు. గ్రంథాలయాధికారి రామచంద్రుడు ఉన్నారు.

గోపాల మిత్రలతోనే వైద్యం

రుద్రవరం, ఆగస్టు 30: రుద్రవరం పశువైద్యశాలలో విధులు నిర్వహిస్తున్న పశువైద్యశాఖ అసిస్టెంటు సహాయ సంచాలకుడు గిడ్డయ్య విధులకు గైర్హాజరయ్యారు. గోపాలమిత్రలే పాడిగేదెకు వైద్యం అందించారు. ఈవైద్యశాల పరిధిలో వైద్యం సక్రమంగా అందడం లేదని రైతులు ఆరోపిస్తున్నారు. రోజూ పాడిగేదెలు, గొర్రెలు, మేకలు వైద్యం కోసం పశువైద్యశాలకు తీసుకువస్తారు. ఇక్కడ వైద్యులు లేకపోవడంతో నిరాశ చెందుతున్నారు. పశువైద్యుడికి ఫోను చేసి ఫోనులో వివరాలు చెబితే ఆ వైద్యం అందిస్తున్నామని గోపాలమిత్రలు చెప్పడం గమనార్హం. ఈవిషయంపై పశు సంవర్ధకశాఖ డీడీ రమణయ్య మాట్లాడుతూ ఏడీ ఏహెచ్ గిడ్డయ్య సెలవు పెడుతున్నాడన్న ఎలాంటి సమా చారం ఇవ్వలేదని, ఆఫీసుకు ఇచ్చారేమో కనుక్కుంటానని చెప్పారు.

గోధుమరి ఎల్లమ్మకు బోనాలు



ఎల్లమ్మకు బోనాలు సమర్పించేందుకు వెళ్తున్న మహిళలు

బేతంచెర్ల, ఆగస్టు 30: మండలంలోని హుసేనాపురం గ్రామంలో శ్రావణ శుక్రవారం పురస్కరించుకుని గ్రామస్థులు గ్రామ దేవత గోధుమరి ఎల్లమ్మకు బోనాలు సమర్పించారు. గ్రామంలోని మహిళలంతా ఆలయానికి చేరుకుని అమ్మవారికి బోనాలను సమర్పించారు.

రుణాలు సకాలంలో చెల్లించాలి

కొలిమిగుండ్ల, ఆగస్టు 30: పొదుపు గ్రూపు సభ్యులు తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించాలని మండల వెలుగు ఏపీఎం తిరుపాల్‌రెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక ఐకేపీ కార్యాలయంలో మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన గ్రామైక్య సంఘం లీడర్లు, బుక్ కీపర్లు, సభ్యులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. వెలుగు సీసీలు పాల్గొన్నారు.

151 రోజుల గురు పారాయణం

డోన్(రూరల్), ఆగస్టు 30: నారా చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి కావాలని కాంక్షిస్తూ 151 రోజులుగా గురు పారాయణం చేసినట్లు దత్తాత్రేయ స్వామి ఆలయ దత్త ఉపాసకులు రామన్నదత్త తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ 151 రోజులుగా గురుపారాయణం చేయడం వల్ల ఫలితం లభించిందన్నారు. చంద్రబాబు రాష్ట్ర ముఖ్య మంత్రిగా ఎన్నికల్లో భారీ విజయాన్ని సాధించి ఓర్వకల్లుకు శనివారం వస్తున్న సందర్భంగా డోన్ దత్తాత్రేయ స్వామి ఆలయాన్ని సందర్శించి కొత్త రాజ్యాధికారం స్వీకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

గుంతలో పడి వృద్ధురాలి మృతి

ఆళ్లగడ్డ, ఆగస్టు 30: మండలంలోని బత్తులూరు గ్రామానికి చెందిన గంగమ్మ(62) నందింపల్లెకు వెళ్లే రహదారిలోని మొరుసు గుంతలో పడి శుక్రవారం మృతి చెందారు. గంగమ్మ దొర్నిపాడు మండలంలోని అర్జునాపురం గ్రామానికి వెళ్లి తిరిగి వస్తుండగా ఈ ఘటన చోటు చేసుకుంది. మృతురాలి మానసిక స్థితి బాగా లేదని రూరల్ ఎస్ఐ హరిప్రసాద్ తెలిపారు. మృతదేహాన్ని శవ పరీక్ష నిమిత్తం ఆళ్లగడ్డ ప్రభుత్వ వైద్యశాలకు తరలించామని చెప్పారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

'విద్యార్థులు బాగా చదవాలి'

ఆళ్లగడ్డ, ఆగస్టు 30: పదో తరగతి పరీక్షల్లో బాగా చదివి ఉత్తమ ఫలితాలను సాధించాలని వెనుకబడిన తరగతుల సంక్షేమ, సాధికారత జిల్లా అధికారి లక్ష్మీదేవి సూచించారు. ఆళ్లగడ్డ పట్టణంలోని బీసీ సంక్షేమ వసతి గృహంలో శుక్రవారం నిర్వహించిన ప్రేరణ శిక్షణాతరగతులను నిర్వహించారు.

ఆళ్లగడ్డలో వర్షం: ఆళ్లగడ్డ ప్రాంతంలో శుక్రవారం సాయంత్రం ఈదురు గాలులతో కూడిన వర్షం కురిసింది. ఈ వర్షం పంటలకు ఊపిరి పోసింది.

ముగిసిన విగ్రహ ప్రతిష్ఠ ఉత్సవాలు

కొలిమిగుండ్ల, ఆగస్టు 30: కొలిమిగుండ్లలోని నాయీబ్రాహ్మణ కాలనీలో రూ.20లక్షలకు పైగా నిధులతో నూతనంగా నిర్మించిన త్యాగరాజ, కోదండరామస్వామి విగ్రహ ప్రతిష్ఠ ఉత్సవాలు శుక్రవారం ముగిశా యి. వేద మంత్రోచ్చారణల మధ్య యంత్రాభిషేకం, ప్రతిష్ఠ హోమం, యంత్ర, శిఖర, ధ్వజ స్తంభ ప్రతిష్ఠలు నిర్వహించారు.

కమణీయం.. కల్యాణం

డోన్(రూరల్), ఆగస్టు 30: డోన్ మండలంలోని ధర్మవరం గ్రామంలో ఎల్లమ్మ గుడి ప్రాంగణంలో ఉన్న వేప, రాగి చెట్లుకు గ్రామ పెద్దల ఆధ్వర్యంలో కల్యాణం నిర్వహించారు. అంతకుముందు ఎల్లమ్మ ఉత్సవ విగ్రహాన్ని వాహనంపై ఏర్పాటు చేసి గ్రామ వీధుల్లో ఊరేగించారు.

విద్యార్థినికి అభినందన

బేతంచెర్ల, ఆగస్టు 30: లండన్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు కైవసం చేస్తున్న బేతంచెర్లకు చెందిన ఏడో తరగతి విద్యార్థిని సుబేక్షా సంజన మాజీ రాజ్యసభ సభ్యుడు టీజీ వెంకటేశ్, డాక్టర్ కేవీ భార్గవ్, బేతంచెర్ల పట్టణ ఆర్యవైశ్యులు శుక్రవారం అభినందించారు. విద్యార్థిని మహారాష్ట్రలోని పూణేలో జాతీయ యువజన సాంస్కృతిక ఉత్సవాల్లో విభిన్న సంస్కృతులు, భాషలను ప్రదర్శించడంలో ప్రతిభను గుర్తించి మెమెంటోను అందజేశారు.

పాత పెన్షన్ విధానం అమలు చేయాలి

కోవెలకుంట్ల, ఆగస్టు 30: పాత పెన్షన్ విధానం అమలు చేయాలని కోవెలకుంట్ల ఎంపీడీవో కార్యాలయం వద్ద ఈవోపీఆర్డీ రాధికారెడ్డికి యూటీఎఫ్ నాయకులు వినతి పత్రం అందజేశారు. శుక్రవారం సాయంత్రం యూటీఎఫ్ తాలుకా శాఖ ఆధ్వర్యంలో ఎంపీడీవో కార్యాలయం ముందు నిరసన వ్యక్తం చేశారు. యూటీఎఫ్ జిల్లా ఆర్థిక శాఖ కార్యదర్శి బాబా ఫక్రుద్దీన్, నాయకులు వెంకటయ్య, నబీరసూల్, మహబూబ్‌బాషా, చెన్నప్ప, విజయభాస్కర్‌రెడ్డి పద్మశేఖర్, చాంద్‌బాషా, రాజు, శేఖర్ పాల్గొన్నారు.

సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

బేతంచెర్ల, ఆగస్టు 30: పొద్దుతిరుగుడు పంట సాగులో రైతులు తప్పనిసరిగా సస్యరక్షణ చర్యలు చేపట్టాలని నంద్యాల ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన కేంద్రం శాస్త్రవేత్త వెంకటరమణమ్మ సూచించారు. శుక్రవారం మండలంలోని హెచ్.కొట్టాల గ్రామ సమీపంలోని పొద్దుతిరుగుడు పంటను నంద్యాల ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన కేంద్రం, పొద్దుతిరుగుడు శాస్త్రవేత్త వెంకటరమణమ్మ గ్రామానికి చెందిన పరమేశ్వరుడు, పొద్దుతిరుగుడు పంటను పరిశీలించారు. ఏవోలు కిరణ్ కుమార్, మధు పాల్గొన్నారు.

పొలంబడి పంటలకు మార్కెట్లో డిమాండ్

సంజామల, ఆగస్టు 30: పొలంబడి ద్వారా పండించే పంటలకు మార్కెట్లో భారీగా డిమాండ్ ఉంటుందని వ్యవసాయ అధికారి సుధాకర్ రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని బొందలదిన్నె గ్రామంలో రైతు గౌరుగారి సుదర్శన్ రెడ్డి పొలంలో పొలంబడి కార్యక్రమం కింద వ్యవసాయ అధికారితోపాటు వీఏఏలు, వీహెచ్ఏలు వరినాట్లు వేశారు.

'సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాం'

కోవెలకుంట్ల, ఆగస్టు 30: పట్టణంలోని బాలయోగి కళాశాల రెసిడెన్షియల్ పాఠశాల, సంక్షేమ హాస్టల్‌లో ఉన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తహసీల్దారు పవన్‌కు మార్‌రెడ్డి, ఈవోపీఆర్‌డీ రాధిక, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ హరిలు అన్నారు. శుక్రవారం కోవెలకుంట్ల పట్టణంలోని బాలయోగి రెసిడెన్షియల్ పాఠశాలను, ప్రభుత్వ బాలికల కళాశాల వసతిగృహాన్ని వారు సందర్శించారు. బాలయోగి గురుకుల కళాశాలలో తాగునీటి సమస్యను పరిష్కరించాలని విద్యార్థినులు వారిని కోరారు.

ఆయుర్వేద వైద్యుడి మృతి

కోవెలకుంట్ల, ఆగస్టు 30: పట్టణానికి చెందిన ఆయుర్వేద వైద్యుడు, దస్తగిరి (82) అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందారు. దస్తగిరి ఆయుర్వేద వైద్యుడిగా నంద్యాల జిల్లాలోని పలు ప్రాంతాల్లో సేవలందించారు. అంతేకాక ఆధ్యాత్మికంగా ఉంటూ శివస్వాములకు ఉచిత అన్నదానం చేసేవారు. ఈయన శుక్రవారం అనారోగ్యంగా మృతి చెందారు. ఈయన మృతికి పలువురు నాయకులు సంతాపం వ్యక్తం చేశారు.

రోడ్డు ప్రమాదంలో పంచాయతీ సెక్రటరీకి గాయాలు

అవుకు, ఆగస్టు 30: అవుకు పట్టణం జమ్ములమ్మ గుడి సమీపంలో శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో అన్నవరం పంచాయతీ సెక్రటరీ రాజేష్‌కు తీవ్ర గాయాలయ్యాయి. రాజేష్ గుండ్లశింగవరం నుంచి మోటర్ సైకిల్‌పై అవుకు వస్తుండగా జమ్ము లమ్మ గుడి సమీపంలో సైడ్‌కు నిలబెట్టిన ట్రాక్టర్‌ను ఢీకొన్నాడు. ఎడమచేయి విరిగి, తలకు గాయాలయ్యా యి. 108 సిబ్బంది గాయపడ్డ రాజేష్‌ను బనగానపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం రాజేష్ పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం నంద్యాలకు తరలించారు.

సమయ వేళలు పాటించాలి

బేతంచెర్ల, ఆగస్టు 30: మద్దిలేటి నరసింహ స్వామి క్షేత్రానికి పాత సమయ పద్ధతి ప్రకారంగానే బస్సు సర్వీసులను నడపాలని టీడీపీ నాయకులు, రంగాపురం గ్రామస్థులు ఆర్టీసీ అధికారులను శుక్రవారం కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో కర్నూలు నుంచి మద్దిలేటి స్వామి దేవస్థానానికి ప్రతి రోజు ఉదయం వచ్చేదని, కానీ సదురు బస్సు సర్వీసు మధ్యాహ్నానికి మార్చారన్నారు. దీంతో తాము ఇబ్బందులకు గురవుతున్నామన్నారు. నాయకులు లొడ్డ రామమద్దయ్య, నల్లారెడద్ది, దుం బాల శేషు, వల్లంపాడు వెంకటేశ్వర్లు, బాలకృష్ణ, రాముడు పాల్గొన్నారు.

రేపు వైద్య శిబిరం

శిరివెళ్ల, ఆగస్టు 30: నంద్యాల ఆయుష్ యోగా సేవా సమితి ఆధ్వర్యంలో శిరివెళ్లలోని నాగేష్ కాంప్లెక్స్‌లో ఆదివారం గుండె, కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు ఆనంద్ గురూజీ, ఖండె శ్యాం సుందర్ లాల్ శుక్రవారం తెలిపారు. నంద్యాలలోని శాంతి రామ్, ఉదయానంద వైద్యశాలల సహకారంతో ప్రజలకు వైద్య సేవలు అందిస్తున్నామన్నారు. కంటి శుక్లము ఉన్నవారికి ఉచితంగా ఆపరేషన్లు చేయిస్తామన్నారు. అలాగే బీపీ, షుగర్, ఈసీజీ, 2డీ ఎకో తదితర పరీక్షలు నిర్వహించనున్నట్లు వారు వెల్లడించారు.